KR TV

మన క్రాంతి

ఇది వాస్తవ పత్రిక...




Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి : 01 సంచిక :77 | శనివారం , 15 ఫిబ్రవరి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 వెల: 3 రూ/-

# నీళ్ల కోసం

## మరో పోరాటానికి సిద్ధమవుదాం..

### కేసీఆర్ ఆకాంక్షను నెరవేర్చుదాం : హరీశ్‌రావు



హైదరాబాద్ : నీళ్ల కోసం మరో పోరాటానికి సిద్ధమవుదాం.. 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఆరాటపడిన కేసీఆర్ ఆకాంక్షను నెరవేర్చుదామని సంగారెడ్డి జిల్లా ముఖ్య నాయకులకు, ప్రజలకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాల పనులు ప్రశ్నార్థకంగా మారిన నేపథ్యంలో అనుసరించాల్సిన కార్యాచరణపై శుక్రవారం సంగారెడ్డి జిల్లా ముఖ్య నాయకులతో కోకాపేట లోని తన నివాసంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్, మాణిక్ రావు, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివ కుమార్, మాజీ జెడ్పీ చైర్మన్ జైపాల్ రెడ్డి, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

2లో

## సామాజిక బహిష్కరణ చేసేందుకు

# రేవంత్ రెడ్డి ఎవరు..

### రఘునందన్ రావు స్ట్రాంగ్ కౌంటర్





తెలంగాణ రాజకీయాలు రోజు రోజుకు రసవత్తరంగా మారుతున్నాయి. ముఖ్యంగా రాజకీయ నేతల మాటలు అగ్గిరాజేస్తున్నాయి. ఈ క్రమంలోనే.. సీఎం రేవంత్ రెడ్డి ఫిబ్రవరి 14న చేసిన కామెంట్లు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అసలు బీసీ కాదని.. కన్వర్టెడ్ బీసీ అని, సర్వేలో పాల్గొనకపోతే కేసీఆర్, కేటీఆర్, కవితను సామాజిక బహిష్కరణ చేయాలంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు రేవంత్ రెడ్డి. కాగా.. రేవంత్ రెడ్డి మోదీపై చేసిన వ్యాఖ్యలకు బీజేపీ ఎంపీ రఘునందన్ రావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.

2లో

# వాలెంటైన్స్ డే రోజున దారుణం..



2లో

# తెలంగాణ విద్యార్థులకు శుభవార్త..

## యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్‌పై సీఎం కీలక నిర్ణయం

తెలంగాణలో విద్యా వ్యవస్థలో ప్రతిష్టాత్మకమైన మార్పులు తీసుకురావాలని యోచిస్తున్న రేవంత్ రెడ్డి సర్కార్.. ప్రయోగాత్మకమైన అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే.. రాష్ట్రవ్యాప్తంగా.. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించ తలపెట్టింది. ఈ మేరకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. శుక్రవారం రోజున బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విద్యాశాఖ ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు అవసరమైన స్థలాల సేకరణ, ఇతర పనుల పురోగతిని సీఎం రేవంత్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు.



2లో

# 'స్వర్గం నిండిపోతుంది'..

## కుంభమేళాపై వివాదస్పద వ్యాఖ్యలు చేసిన ఎంపీపై కేసు



లక్నో: మహా కుంభమేళాపై ఒక ఎంపీ వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. పవిత్ర స్నానాలతో భక్తుల పాపాలు పోయి స్వర్గం నిండిపోతుందని అన్నారు. హిందూ సంఘాలు దీనిపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీనిపై ఫిర్యాదు అందడంతో ఆ ఎంపీపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయోగ్‌రాజ్‌లో మహా కుంభమేళా జరుగుతున్నది. కోట్లాది మంది భక్తులు త్రివేణి సంగమంలో పవిత్ర పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు.


2లో

# 'పంజాబ్‌కే ఎందుకు?'

### అమెరికాలోని అక్రమ వలసదారుల తరలింపుపై వివాదం

చండీగఢ్: అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న భారత వలసదారులను ఆ దేశ ఎయిర్‌ఫోర్స్ విమానాల్లో తరలిస్తున్నారు. ఫిబ్రవరి 5న మొదటి బ్యాచ్ కింద 104 మంది భారతీయులతో ఒక విమానం పంజాబ్‌లోని అమృత్‌సర్ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యింది.

2లో



### ప్రజాపాలన ముసుగులో

# రాక్షస పాలన..

రేవంత్ ప్రభుత్వంపై మండిపడ్డ కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి





2లో

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం..

## మాజీ డీఎస్పీ

# ప్రణీత్‌రావుకు బెయిల్





**-ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ2గా మాజీ డీటఎస్పీ**

**-ఏడాదికిపైగా రిమాండ్ ఖైదీగా జైల్లో ప్రణీత్‌రావు**

**-బెయిల్ మంజూరుచేసిన నాంపల్లి సెషన్స్ కోర్టు**

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుకు కోర్టులో ఊరట దక్కింది. నాంపల్లి కోర్టు ఆయనకు శుక్రవారం నాడు బెయిల్ మంజూరు చేసింది. ప్రణీత్‌రావు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై పలు దఫాలుగా విచారణ చేపట్టిన నాంపల్లి సెషన్స్ కోర్టు న్యాయమూర్తి.. ఎట్టకేలకు రెగ్యూలర్ బెయిల్ మంజూరు చేస్తూ తీర్పును వెలువరించారు. కాగా, సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు ఏ2గా ఉన్న విషయం తెలిసిందే. ఆయన ప్రస్తుతం రిమాండ్ ఖైదీగా చంచల్‌గూడ జైలులో ఉన్నారు.

2లో

## నేటిమాట

"గమ్యాన్ని చేరుకోవడానికి మిమ్మల్ని మీరు హద్దులు విధించుకోకండి. మీ శక్తి ఊహకు అందనిది!"



- బ్రూస్ లీ

# వంద మంది రౌడీ షీటర్లతో

# రేవంత్‌రెడ్డి సమానం..

### తీవ్రంగా స్పందించిన పెద్ది సుదర్శన్‌రెడ్డి




సీఎం రేవంత్‌రెడ్డి వందమంది రౌడీ షీటర్లతో సమానమని బీఆర్ఎస్ నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. కేసీఆర్‌పై రేవంత్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణను సాధించి.. దేశంలోనే అగ్రభాగాన నిలిపిన కేసీఆర్‌కు తెలంగాణలో జీవించే హక్కులేదనడం రేవంత్‌రెడ్డి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు.

# యువతకు ఉపాధి కల్పించేలా పర్యాటకం ఉండాలి



2లో

# సామాజిక బహిష్కరణ చేసేందుకు రేవంత్ రెడ్డి ఎవరు..

## రఘునందన్ రావు స్ట్రాంగ్ కౌంటర్

మొదటి పేజీ తరువాయి

మోదీ కులంపై మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి.. ముందు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీది ఏ కులమో చెప్పాలంటూ రఘునందన్ రావు ప్రశ్నించారు. అడ్డగోలుగా మాట్లాడిన వాళ్లంతా చరిత్రలో కలిసిపోయారంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి మాటల్లో చేతగానితనం స్పష్టంగా కనిపిస్తోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

కులగణన సర్వేలో పాల్గొనని వారందరినీ సామాజిక బహిరష్కరణ చేయాలంటూ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై రఘునందన్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కులగణనలో పాల్గొనాలని చట్టంలో ఉందా అంటూ ప్రశ్నించారు. సామాజిక బహిష్కరణ చేయడానికి రేవంత్ రెడ్డి ఎవరని ప్రశ్నించారు. అసలు నరేంద్ర మోదీ గురించి మాట్లాడే నైతిక హక్కు రేవంత్ రెడ్డికి లేదని రఘునందన్ రావు చెప్పుకొచ్చారు.

బీసీల గురించి మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి.. తన కేబినెట్‌లో ఎంతమందికి స్థానం ఇచ్చారంటూ రఘునందన్ రావు ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కేబినెట్‌లో 17 మంది బీసీ మంత్రులు ఉన్నారని చెప్పుకొచ్చారు. కానీ రేవంత్ రెడ్డి కేబినెట్‌లో మాత్రం ఇద్దరే ఇద్దరు బీసీ మంత్రులున్నారని ఎద్దేవా చేశారు. ఏదైనా మాట్లాడే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలని రేవంత్ రెడ్డికి రఘునందన్ రావు హితవు పలికారు. మోదీ కులం ఓసీ నుంచి బీసీకి వచ్చిందని రేవంత్ రెడ్డి ఇప్పుడే కనిపెట్టినట్లు మాట్లాడుతుంటే నవ్వొస్తుందంటూ రఘునందన్ సెటైర్లు వేశారు.

అంతకుముందు గాంధీ భవన్‌లో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి.. ప్రధాని మోదీ బీసీ కాదని, ఆయన లీగల్లీ కన్వర్టెడ్ బీసీ అని చెప్పుకొచ్చారు. మోదీ పుట్టుకతోనే ఉన్నత కులమని చెప్పారు. 2002లో ముఖ్యమంత్రి అయ్యాక ఆయన కులాన్ని ఓసీ నుంచి బీసీల్లో చేర్చుకున్నారని చెప్పుకొచ్చారు. ఆయన బీసీ అయితే ఇన్నాళ్లు కులగణన ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. చిత్తశుద్ధి ఉంటే జనగణనలో కులగణనను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ లెక్కలను తప్పు పడితే నష్టపోయేది బీసీలే అని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

# వంద మంది రౌడీ షీటర్లతో రేవంత్‌రెడ్డి సమానం..

## తీవ్రంగా స్పందించిన పెద్ది సుదర్శన్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి

రేవంత్‌రెడ్డి పెద్ద జోకర్, తెలంగాణ ద్రోహి అంటూ మండిపడ్డారు. పరిపాలన చేతకాక ఇలా ప్రజల మధ్య, కులాల మధ్య, మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నాడని మండిపడ్డారు. తెలంగాణ కోసం పోరాటం చేసి.. సాధించిన యోధుడు కేసీఆర్ అన్నారు.

హైదరాబాద్‌ను ప్రపంచంలోనే ఐటీలో మేటిగా నిలిపిన నేత కేటీఆర్ అన్నారు. సాగునీటి రంగంలో విప్లవాన్ని తీసుకొచ్చిన నేత హరీశ్ రావు అని.. అలాంటి నేతలను తెలంగాణలో జీవించే హక్కులేదనటం సీఎం వెకిలి మనస్తత్వానికి నిదర్శనమన్నారు. రేవంత్‌రెడ్డి తెలంగాణ ద్రోహి అని.. ఓటుకు నోటు దొంగ, 420 అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ఏనాడూ కక్ష పూరిత రాజకీయాలు చేయలేదని.. బిడ్డా నోరు అదుపులో పెట్టుకోవాలని.. చిల్లర కూతలు ఆపాలని.. లేకుంటే ప్రజలే తరిమికొడుతారని హెచ్చరించారు. నీ పాలనలో ఒక్క కార్యక్రమమైనా విజయవంతంగా నిర్వహించావా? కేసీఆర్‌ను తిట్టడం తప్ప చేసింది ఏమీ లేదన్నారు.



# వాలెంటైన్స్ డే రోజున దారుణం..

## యువతిపై ప్రేమోన్మాది యాసిడ్‌తో దాడి

మొదటి పేజీ తరువాయి

వాలెంటైన్స్ డే రోజున ఓ ప్రేమోన్మాది యువతిపై యాసిడ్‌తో దాడి చేయడం సంచలనంగా మారింది. అన్నమయ్య జిల్లాలోని గుర్రంకొండ మండలంలోని ప్యారంపల్లెకు చెందిన గౌతమి(23) అనే యువతిపై ప్రేమోన్మాది గణేష్ కత్తితో పొడిచి ముఖంపై యాసిడ్ పోశాడు. దీంతో బాధితురాలు తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమె స్థానికులు మదనపల్లెలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్య చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు.

గౌతమికి ఏప్రిల్ 29న పెళ్లి నిశ్చయమైంది. ఈ నేపథ్యంలోనే గౌతిమి పెళ్లిపై గణేష్ కోపం పెంచుకుని దాడికి పాల్పడ్డాడు. నిందితుడు మదనపల్లె అమ్మ చెరువుమిట్టకు చెందినవాడిగా పోలీసులు గుర్తించారు. మదనెపల్లే జడ్జి బాధితురాలి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు , హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా ఖండించారు.

నిందితుడిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించరాదని ఆదేశాలు జారీ చేశారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితురాలికి ప్రభుత్వం తరుపున ఆదుకుంటామని సీఎం వెల్లడించారు. ఘటనపై వైసీపీ అధ్యక్షుడు , మాజీ సీఎం వైఎస్ జగన్ తీవ్రంగా ఖండించారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

# యువతకు ఉపాధి కల్పించేలా పర్యాటకం ఉండాలి

## : సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రానికి ఆదాయం సమకూరడంతో పాటు యువతకు ఉపాధి కల్పించే ఆదాయ వనరుగా పర్యాటకశాఖ ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పర్యాటకులను ఆకర్షించే వనరులు మనకు ఎన్నో ఉన్నా.. గతంలో ప్రచారంపైనా శ్రద్ధ చూపకపోవడం, వినూత్న పద్ధతిలో ఆలోచించకపోవడంతో ఈ రంగంలో ఆశించిన ప్రగతి కనిపించడం లేదన్నారు. తెలంగాణ ఘన చరిత్రను వర్తమానానికి అనుసంధానిస్తూ.. భవిష్యత్‌కు బాటలు వేసేలా పర్యాటక శాఖను తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. పర్యాటక శాఖపై ఐసీసీసీలో సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో పర్యాటకరంగంలో పెట్టుబడులు పెట్టేవారికి ప్రోత్సాహకాలు కల్పించాలని సూచించారు. సాగర్ బ్యాక్ వాటర్‌లో బోట్ హౌస్ అందుబాటులో ఉంచాలని.. డిస్టినేషన్ వెడ్డింగ్‌లకు తెలంగాణను వేదికగా మార్చాలని సీఎం చెప్పారు.

ఆలయాలు, పులుల అభయారణ్యాలకు పర్యాటకంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉందని.. ఆ దిశలో దృష్టి సారించి.. అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భద్రాచలం, సలేశ్వరం, రామప్ప ఆలయాలు, మల్లెల తీర్థం, బొగత జలపాతాలు, బౌద్ధ స్తూపాలు, జైనా ఆలయాలు ఇలా ప్రతి ఒక్క పర్యాటక ప్రదేశంలో వసతులు మెరుగుపర్చడంతో పాటు సరైన ప్రచారం కల్పించాలని సూచించారు. భువనగిరి కోట రోప్‌వే పనులపై ఆరా తీశారు. పర్యాటక శాఖ పాలసీకి తుది రూపు ఇచ్చే సమయంలో అటవీ, ఐటీ, విద్యుత్, టీజీ ఐఐసీ, వైద్య, క్రీడల శాఖలతో సమన్వయం చేసుకోవాలని.. ఒకశాఖ విధానాలు మరో శాఖ విధానాలకు ఆటంకం కలుగకుండా జాగ్రత్తలు వహించాలని చెప్పారు. సమీక్షలో మంత్రి జూపల్లి కృష్ణారావు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, సీఎస్ శాంతి కుమారి, సలహాదారు శ్రీనివాసరాజు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు వీ శేషాద్రి, చంద్రశేఖర్‌రెడ్డి, సీఎం సంయుక్త కార్యదర్శి సంగీత సత్యనారాయణ, పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.

# తెలంగాణ విద్యార్థులకు శుభవార్త..

## యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్‌పై సీఎం కీలక నిర్ణయం

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా తలపెట్టిన ఈ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు సంబంధించి నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి విద్యా శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. నియోజకవర్గాల్లో ఎక్కడైతే స్థలాల కేటాయింపు ప్రక్రియ పూర్తయిన చోట అనుమతులు, ఇతర పనులను వేగంగా చేయాలని ఆదేశించారు. ప్రతిపాదిత స్థలాలు రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు అనువుగా ఉన్నాయో లేదో ముందుగా పరిశీలించాలని సూచించారు. అనువైన స్థలంలేని చోట ప్రత్యామ్నాయ స్థలాన్ని సేకరించాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల కోసం జిల్లా కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి త్వరగా స్థలాలను గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలని, దీనిపై వారం రోజుల్లో నివేదిక అందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇప్పటికే స్థల సేకరణ జరిగిన నియోజకవర్గాల్లో యుద్ధ ప్రాతిపదికన పనులు మొదలుపెట్టాలని తెలిపారు. రెండేళ్లలో 105 నియోజకవర్గాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలతో వంద శాతం పనులు పూర్తికావాలని సూచించారు. రేవంత్ రెడ్డి ఆదేశాలతో.. మరో రెండేళ్లలోనే తెలంగాణలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు రాబోతుండటం.. విద్యార్థులకు ఊరట కలిగిస్తోంది.

వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయ అభివృద్ధికి అవసరమైన నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ విశ్వవిద్యాలయంలో భవిష్యత్తు అవసరాలకు తగినట్టుగా పూర్తి స్థాయి ప్రమాణాలతో సరైన మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# ప్రజాపాలన ముసుగులో రాక్షస పాలన..

## రేవంత్ ప్రభుత్వంపై మండిపడ్డ కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి




రేవంత్‌రెడ్డి సర్కారు ప్రజాపాలన ముసుగులో రాక్షస పాలన సాగిస్తుందని.. ప్రజా సమస్యలపై ప్రశ్నించే నాయకులను ప్రభుత్వం గొంతు నొక్కుతోందని కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. బీఆర్ఎస్ నేత అన్నపర్తి శేఖర్ అరెస్టుపై జిల్లా ఎస్పీని కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ పనితీరుపై ఇప్పటికే ప్రజలు అభిప్రాయానికి వచ్చారని.. అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆందోళనబాట పడుతున్నారని మండిపడ్డారు. మునుగోడు ఎమ్మెల్యే అభివృద్ధిని మరిచి వ్యక్తిగతంగా బీఆర్ఎస్ నాయకులపై కుట్రలకు చర్యలు చేపడుతున్నారన్నారు. ఇది మంచి పద్ధతి కాదని.. అభివృద్ధిపై ప్రజలతో మమేకమై సాగాలి తప్ప వ్యక్తిగతంగా టార్గెట్ చేసి భయభ్రాంతులకు గురి చేసే విధానం సరైనది కాదన్నారు.

మంత్రి పదవి వస్తుందని ఊహించుకొని అది రాకపోవడంతో సహనం కోల్పోయి ఇష్టానుసారంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. కొన్ని రోజులు గడ్డం పెంచుకొని తిరుగుతున్నాడని.. శాశ్వతంగా మంత్రి పదవి రాదని తెలిస్తే ఏమైతాడో అర్థం కావడం లేదన్నారు. ఆయన విధానాలపై ప్రజలు ఆలోచన చేయాలని.. ఎమ్మెల్యే అంటే నియోజకవర్గ అంతటికి ప్రజాప్రతినిధి అన్నది మరచి కొంతమందికే అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిగత దూషణలు మార్చి అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న అన్యపర్తి శేఖర్‌ని.. అర్ధరాత్రి అక్రమంగా భయభ్రాంతులకు గురి చేస్తూ అరెస్టు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. పోలీసులు చట్టంపై తమకు గౌరవం ఉందని న్యాయం జరిగేంత వరకు శేఖర్ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. శేఖర్ అరెస్టు అన్యాయమని ఇంతటి చర్యలకు పాల్పడ్డ వారు తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు.

# ‘పంజాబ్‌కే ఎందుకు?’

## అమెరికాలోని అక్రమ వలసదారుల తరలింపుపై వివాదం

మొదటి పేజీ తరువాయి

ఫిబ్రవరి 15, 16న మరో రెండు విమానాలు కూడా ఇక్కడ ల్యాండ్ కానున్నాయి. అయితే అమెరికాలోని భారత అక్రమ వలసదారులను కేవలం పంజాబ్‌కే తరలించడంపై రాజకీయ వివాదం చెలరేగింది. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అమృత్‌సర్‌ను ల్యాండింగ్ పాయింట్‌గా ఎంచుకున్నట్లు ప్రతిపక్ష పార్టీలు ఆరోపించాయి. పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వంతోపాటు కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వం తీరును విమర్శించింది.

కాగా, అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న భారత వలసదారులను పంజాబ్‌కు తరలించాలన్న కేంద్రం నిర్ణయంపై సీఎం భగవంత్ మాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన అమృత్‌సర్‌కు చేరుకున్నారు. దీనిపై మీడియా సమావేశంలో ఆయన మాట్లాడనున్నారు. ఈ చర్య వెనుక కేంద్ర ప్రభుత్వ ఉద్దేశాలను సీఎం భగవంత్ మాన్ ప్రశ్నించనున్నట్లు తెలుస్తున్నది.

# నీళ్ల కోసం

## మరో పోరాటానికి సిద్ధమవుదాం..

### కేసీఆర్ ఆకాంక్షను నెరవేర్చుదాం : హరీశ్‌రావు

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు త్వరలో చేసే పోరాటం గురించి ఈ సమావేశంలో చర్చించారు. సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టు పనులను వెంటనే పూర్తి చేయాలనే డిమాండ్‌తో, ఆ ప్రాజెక్టుల నిర్దేశిత ఆయకట్టు ప్రాంతాల్లో బీఆర్ఎస్ పార్టీ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు.

రెండేళ్ల క్రితం 2022 ఫిబ్రవరి 21న నారాయణ్ ఖేడ్‌లో అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అధికారంలోకి వచ్చి 14నెలలు గడుస్తున్నా కాంగ్రెస్ పార్టీ ఆ ప్రాజెక్టుల వైపు తొంగి కూడా చూడలేదు. దీంతో సంగారెడ్డి జిల్లా నారాయణ్ ఖేడ్, ఆందోల్, సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గ ప్రజల సాగు నీరు కలగానే మారింది. దీంతో ప్రభుత్వంలో కదలిక తెచ్చి, ప్రాజెక్టులు పూర్తి చేయించి, దాదాపు 4 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సంగమేశ్వర, బసవేశ్వర సాగునీటి ప్రాజెక్టులపై పోరాటానికి సిద్ధం అవుదామని పిలుపునిచ్చారు. ఆ దిశగా సంసిద్ధం కావాలని సూచించారు.

# కుక్కలతో జాగ్రత్త

**కుక్కతో సరదా చేసేందుకు వ్యక్తి యత్నం..**

**అది ఏం చేసిందంటే?**

న్యూఢిల్లీ: పెట్ క్లినిక్‌లో ఉన్న పెంపుడు కుక్కతో సరదాగా ఆడేందుకు ఒక వ్యక్తి ప్రయత్నించాడు. తొలుత చాలా కూల్‌గా ఉన్న ఆ కుక్క ఉన్నట్టుండి వైలెంట్‌గా మారింది. ఆ వ్యక్తిపై అది దాడి చేసింది. అతడి చేతిని నోటితో గట్టిగా పట్టుకున్నది. దీంతో ఆ కుక్క నోటి నుంచి చేతిని విడిపించుకునేందుకు ఆ వ్యక్తి తీవ్ర ప్రయత్నం చేశాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఫిబ్రవరి 11న ఒక పెట్ క్లినిక్‌లోని సోఫాలో ఇద్దరు వ్యక్తులు కూర్చొన్నారు. ఆ రూమ్‌లో ఒక పెంపుడు కుక్క ఉంది. అది ఉత్సాహంగా అక్కడ తిరిగింది.

కాగా, సోఫాలో కూర్చొన్న ఒక వ్యక్తి ఆ కుక్కను చూసి సరదాపడ్డాడు. దానిని పట్టుకుని నిమరసాగాడు. మొదట కూల్‌గా ఉన్న ఆ కుక్క ఉన్నట్టుండి వైలెంట్‌గా మారింది. ఆ వ్యక్తి చేతిని నోటితో గట్టిగా పట్టుకుంది. అతడు తన చేతిని వదిలించుకునేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆ కుక్క అతడిపై మరింతగా దాడి చేసింది. ఈ నేపథ్యంలో దాని నోట్లో ఉన్న చేతిని విడిపించుకునేందుకు ఆ వ్యక్తి చాలా శ్రమించాడు. చివరకు క్లినిక్ డోర్ నుంచి బయటకు కుక్కను నెట్టి దాని బారి నుంచి తప్పించుకున్నాడు.

మరోవైపు పెట్ క్లినిక్‌లోని సీసీటీవీలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో ఉత్సాహంగా ఉన్న పెంపుడు కుక్క ఉన్నట్టుండి అలా ఎందుకు ప్రవర్తించిందో అన్నదానిపై ఆన్‌లైన్‌లో చర్చకు దారి తీసింది. కుక్కను ఆ వ్యక్తి రెచ్చగొట్టి ఉంటాడని ఒకరు అనుమానించారు. జాలీగా ఉన్న ఆ కుక్క జోలికి అతడు వెళ్లకుండా ఉండాల్సిందని మరొకరు అభిప్రాయపడ్డారు. పెంపుడు కుక్కలు అప్పుడప్పుడు ఇలా కొరుకుతాయన్నది అర్థం చేసుకునేదే అని ఒకరు పేర్కొన్నారు.



# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం..

## మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుకు బెయిల్


మొదటి పేజీ తరువాయి

రెగ్యులర్ బెయిల్ కోసం ఫిబ్రవరి 11న ఆయన తరఫున లాయర్ ఉమామహేశ్వరరావు 1వ అదనపు జిల్లా కోర్టులో వాదనలు పూర్తి చేశారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాంబశివారెడ్డి విచారణకు హాజరుకాకపోవడంతో పీపీ వాదనల కోసం జడ్జి రమాకాంత్ విచారణను గురువారానికి వాయిదా వేశారు. గురువారం పీపీ వాదనలు అనంతరం తీర్పును రిజర్వ్ చేసిన న్యాయమూర్తి.. శుక్రవారం ఉదయం నిర్ణయం వెలువరించారు. ఇప్పటికే ఈ కేసులో నిందితులుగా ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీ తిరుపతన్న, ప్రభాకర రావు, భుజంగరావుకు ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా మధ్యంతర బెయిల్ మంజూరైంది.

ప్రణీత్‌రావు తరపు లాయర్ వాదనలు వినిపిస్తూ.. భుజంగరావుకు బెయిల్ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. మధ్యంతర బెయిల్ గడువును హైకోర్టు సైతం పొడిగించదని, అనంతరం రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసిందని వివరించారు. విచారణ పూర్తి కాలేదని పోలీస్ అధికారులు కౌంటర్ అఫిడివిట్‌లో పేర్కొన్నప్పటికీ పీపీ వాదనల్ని హైకోర్టు తిరస్కరించిందని వివరించారు.

90 రోజులు రిమాండ్ ఖైదీగా పూర్తిచేసుకున్న తర్వాత 167 సీర్పీసీ కింద ప్రణీత్‌రావు దాఖలు చేసిన మ్యాండేటరీ (తప్పనిసరిగా) బెయిల్‌ను 14వ అడిషినల్ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్టేట్ కోర్టు కొట్టివేసిందని తెలిపారు..

అలాగే, తిరుపతన్నకు సుప్రీంకోర్టు, రాధాకిషన్‌రావుకు హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ ఇచ్చిందని, దాదాపు ఏడాదిగా చంచల్‌గూడా జైలులో రిమాండ్‌ఖైదీగా ఉన్న ప్రణీత్‌రావుకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయాలని కోరడంతో వాదనలను పరిగణనలోకి తీసుకుని రెగ్యులర్ బెయిల్ ఇచ్చింది.




# ‘స్వర్గం నిండిపోతుంది’..

## కుంభమేళాపై వివాదస్పద వ్యాఖ్యలు చేసిన ఎంపీపై కేసు

కాగా, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ)కి చెందిన ఎంపీ అఫ్జల్ అన్సారీ దీనిపై వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. ‘మహా కుంభమేళాలో పవిత్ర స్నానం చేయడం ద్వారా ప్రజల పాపాలు తొలగిపోతాయని నమ్ముతారు. భారీ జన సమూహాన్ని చూస్తుంటే, ఇప్పుడు ఎవరూ నరకంలో మిగిలి ఉండరని, స్వర్గం నిండిపోతుందని అనిపిస్తోంది’ అని అన్నారు. అలాగే కుంభమేళాలో జరిగిన తొక్కిసలాటలో మరణించిన వారి సంఖ్యను తెలియజేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కుంభమేళాలో భారీగా గంజాయి సేవిస్తారని గతంలో కూడా వివాదస్పద వ్యాఖ్యలు చేశారు.

మరోవైపు ఎస్పీ ఎంపీ అఫ్జల్ అన్సారీ వ్యాఖ్యలపై హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. జిల్లా సహకార బ్యాంకు మాజీ అధ్యక్షుడు దేవ్ ప్రకాష్ సింగ్ ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అన్సారీ తన పదవీ గౌరవాన్ని దెబ్బతీయడమే కాకుండా హిందువుల మతపరమైన మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడినట్లు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఎంపీ అన్సారీపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.




# యువత పుట్టిన రోజు వేడుకలు గోశాలలో జరుపుకోవాలి ప్రముఖ న్యాయవాది బెజ్జంకి శ్రీకాంత్



కరీంనగం,14 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): కరీంనగర్ పట్టణంలోని గిద్ద పెరుమాండ్ల గోశాల కేంద్రంలో ప్రముఖ న్యాయవాది బెజ్జంకి శ్రీకాంత్ పిలుపు మేరకు మాస్టర్ కొమరవెల్లి వైభవ కృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, హిందూ వాహిని జిల్లా సంయోజక్, వొపా లీగల్ అడ్వైజర్ ,ప్రముఖ న్యాయవాది బెజ్జంకి శ్రీకాంత్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కరీంనగర్ పట్టణంలో పుట్టిన రోజు వేడుకలు గోశాలలో జరుపుకోవాలని సదుద్దేశంతో నేనిచ్చిన పిలుపు మేరకు వెలాది మంది తమ పుట్టినరోజు వేడుకలు గోశాల కేంద్రంలో జరుపుకుంటున్నారని, ఇలా జరుపుకోవడం శుభపరిణామని, ప్రతి ఒక్కరు కూడా ఇలా జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గోవులకి కూరగాయల, ఆకుకూరల వితరణ చేసి గోశాల కేంద్రాన్ని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో కొమురెల్లి శివకృష్ణ, నల్లి సందీప్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సంధర్భంగా శ్రీకాంత్ సేవలని పలువురు జాతీయవాదులు ప్రశంసించారు.


# షార్ట్ ఫిలిం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న పరకాల కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు శ్రీ సోదా రామకృష్ణ



పరకాల,14 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): ఈరోజు పరకాల పట్టణ అంబేద్కర్ సెంటర్ రాజీపేటకు చెందిన గోవింద శ్రీనివాస్ గారి డైరెక్షన్లో శివం షార్ట్ ఫిలిం వారు తీస్తున్న డీ డాటర్ అనే షార్ట్ ఫిలిం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు శ్రీ సోదా రామకృష్ణ గారు సోదా రామకృష్ణ గారు మాట్లాడుతూ వరంగల్ ఉమ్మడి జిల్లాలో అనేకమంది సినిమా రంగంలో నైపుణ్యం కలిగి ఉన్నారు. పరకాలలో రాజీపేట కు చెందిన గోవింద శ్రీనివాస్ షార్ట్ ఫిలిం తీయడం ఎంతో ఆనందంగా ఉంది అని అన్నారు. ఈ షార్ట్ ఫిలిమ్స్ యువతకు,ప్రజలకు నచ్చేటట్టు ఉండాలని, ఇలాంటి ఎన్నో షార్ట్ ఫిలిమ్స్ తీసి తెలంగాణ నుంచి సినిమా చిత్ర పరిశ్రమ రంగంలో అడుగు పెట్టాలని కోరుకుంటూ మీలాంటి కళాకారులకు నా వంతు సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఏకు రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుల రమేష్, నల్లెల్ల అనిల్ కుమార్, బండి సదానందం గౌడ్, మార్క రఘుపతి గౌడ్, మేకల దేవయ్య, ఏకు బొబ్బిలి,గూడెల్లి రంజిత్,MD అలీ, గోవిందు క్రాంతి, కొయ్యడ శ్రీనివాస్, పరకాల కూరగాయల మార్కెట్ అధ్యక్షులు ఏకు కేత తదితరులు పాల్గొన్నారు

# నడికూడ 2018 నుండి 2024 గ్రామ అభివృద్ధిలో భాగంగా చేసిన పనులకు ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్



పరకాల నడికుడా,14 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): నడికూడ మండల గ్రామపంచాయతీ భవనానికి మరియు పాఠశాల భవనానికి తాళం వేసి వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపిన మాజీ సర్పంచ్ ఊర రవీందర్ రావు.గ్రామపంచాయతీ భవన నిర్మాణము, మన ఊరు మనబడిలో డైనింగ్ హాల్ నిర్మాణము,gp నుండి hm ఆఫీసు నిర్మాణము, మన ఊరు మనబడి లో క్లాసు రూమ్ ల నిర్మాణము, rws సప్లై కోసం సీడీపీ నిధుల నుంచి పైప్ లైన్ నిర్మాణం, జిపి డెవలప్మెంట్ భాగంగా గ్రావెల్ మరియు లైటింగ్ నిర్మాణం వీటిని నిర్మాణ ఖర్చు 51 లక్షల 50 వేల రూపాయలు అప్పులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేశామన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 14 నెలల నుండి పెండింగ్ బిల్లు చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్న ధర్మంలో వడ్డీలు కట్టలేక మా కుటుంబాలు రోడ్డు మీద పడి ఆత్మహత్య చేసుకునే పరిస్థితిలో ఉన్నామని ప్రభుత్వం త్వరగా పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు.

# ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి మాల మహానాడు నాయకుల డిమాండ్



మంచిర్యాల,14 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐ బి సౌరస్థలోని బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి మాల మహానాడు నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సి వర్గీకరణకి అనుకూలంగా తీర్మానం చేయటాన్ని తెలంగాణ మాల మహనాడు నాయకులు తీవ్రంగా ఖండించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే ఎస్సి వర్గీకరణకి చేసిన తీర్మానాన్ని రద్దు చేయలని డిమాండ్ చేశారు.సమీర్ అక్తర్ కమిషన్ ఇచ్చిన నివేదిక తప్పుల తడక ల ఉందన్నారు. నిజంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కి ఎస్సిల అభివృద్ధి మీద నిజమైన ప్రేమ ఉంటే ఎస్సి లకు జనాభా ప్రతిప్రదికన 20% రిజర్వేషన్లను పెంచాలన్నారు. అంతే కానీ ఉన్నదాన్నే పంచి మలో మేమె కొట్టుకొనెల చేయటం తగదన్నారు.రాజ్యాంగ విరుద్ధంగా ఉన్న ఎస్సి వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేయటాన్నీ మాల మహానాడు నాయకులు తీవ్రంగా ఖండించారు.ఇప్పటికైనా ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేకమైన వర్గీకరణను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో దళిత బహుజన పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ కాంటెస్ట్ అభ్యర్థి నిచకోలా రామ్ చందర్ మాట్లాడుతూ రాజ్యాంగ వ్యతిరేకమైన వర్గీకరణ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏ ఓ కి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు జిల్లా ఇంచార్జ్ లింగాల జలపతి, జిల్లా అధ్యక్షులు రావుల లక్ష్మణ్, రాష్ట్ర నాయకులు చిప్పరి కరుణాకర్, పులి రాజా రామ్,పులి మధునేష్, సీనియర్ నాయకులు పిట్టల ఈశ్వర్,పులి తిరుపతి, పులి వినేశ్, శ్రీనివాస్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# నివాళులర్పించిన పరకాల వ్యవసాయ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ రేణిగుంట్ల సదయ్య



పరకాల,14 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని తహరాపూర్ గ్రామ నివాసురాలు బడుగు రజిత గారి దశదినకర్మ కార్యక్రమానికి పరకాల మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ రేణుకుంట్ల సదయ్య తహరాపూర్ గ్రామ మాజీ ఉప సర్పంచ్ కుక్కల బిక్షపతి తహరపూర్ గ్రామ మాజీ వార్డ్ మెంబర్లు కొమ్ముల సంతోష్ మరియు రేణికుంట్ల కుమారస్వామి ధారంగుల చంద్రప్రకాష్ వల్లెపు దిలీప్ ఈ కార్యక్రమానికి హాజరై రజిత చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులు అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసినారు

# చలో గాంధీ భవన్



పరకాల ,14 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): పరకాల నియోజకవర్గం శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు నడికుడా మండల కాంగ్రెస్ పార్టీ సమన్వ కమిటీ సభ్యులు హైదరాబాద్ గాంధీ భవన్ లో కుల గణన మరియు యస్సీ వర్గీకరణ విషయంలో విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొనుటకై బయలుదేరిన నడిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కోడెపాక కర్ణాకర్, సుమలత పాడి ప్రతాప్ రెడ్డి,పార్నెం మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి మలహాల్ రావు, గోల్కొండ UC సదానందం,బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్ల చిన్ని, పార్నెం తిరుపతిరెడ్డి, బొల్లె బిక్షపతి, పెద్ద బోయిన రవీందర్ యాదవ్,కోడెపాక ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు

# నూతన వస్త్రుర్ల శుభాకాంక్షలు ఆశీర్వదించిన మాజీ సర్పంచ్ రేణిగుంట సదయ్య



పరకాల ,14 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): శాయంపేట మండలంలోని తహరాపూర్ గ్రామ నివాసులు గాజు కరుణాకర్ మమత దంపతుల కుమార్తె తేజస్వి నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ కార్యక్రమానికి తహరాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ రేణుకుంట్ల సదయ్య తహరాపూర్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ కుక్కల బిక్షపతి వార్డు మెంబర్లు రేణుకుంట్ల సుమన్ రేణు కుంట్ల కుమారస్వామి మరియు కాంగ్రెస్ జిల్లా నాయకులు మాచర్ల సదానందంలు పాల్గొని తేజస్విని ఆశీర్వదించినారు


# ప్రైవేట్ కార్పొరేటు విద్య సంస్థలకు కోమ్ముకాస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలి SFI జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్



పరకాల,14 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): హనుమకొండ నగరంలో జిల్లా కేంద్రంలో ప్రైవేట్ కార్పొరేటు విద్య సంస్థలకు కొమ్ముకాస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి అలాగే డీఈవో గారిని వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు శుక్రవారం రోజున నగరంలోని రాంనగర్ ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ హనుమకొండ నగరంలో ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా ప్రైవేట్ కార్పొరేట్ విద్య సంస్థలు జూనియర్ కళాశాలలు అలాగే స్కూల్స్ విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర వేల లక్షల రూపాయల్లో అధిక ఫీజులు వసూలు చేస్తూ ప్రభుత్వ నియమ నిబంధనలు తుంగలో తొక్కుతున్నారన్నారు ఒక్క కాలేజీకి పర్మిషన్ తీసుకోనీ నాలుగు ఐదు బ్రాంచ్ లు ఏర్పాటు చేసుకోనీ నడిపిస్తున్నారు ఇంత జరుగుతున్న ఇప్పటి వరకు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి అలాగే డీఈవో గారు ఒక్క కాలేజీకి స్కూలు కి కూడా పొయ్యి పర్యవేక్షించిన పాపాన పోలేదన్నారు నగరంలో ప్రైవేటు కార్పొరేట్ విద్య సంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు సీబీఎస్ఈ పర్మిషన్ లేకున్న కూడా బోర్డ్స్ పెట్టి నడిపిస్తున్నారు అన్నారు గతంలో ఈ సమస్యలపై డి ఐ ఈ ఓ గారికి డీఈఓ గారికి ఎన్ని వినతి పత్రాలు ఇచ్చినా కూడా వారి పైన చర్యలు తీసుకోలేదన్నారు ఇలాంటి అధికారులు ఉండడం వల్లనే హనుమకొండ నగరంలో జిల్లా కేంద్రంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్య సంస్థలు విచ్చలవిడిగా రెచ్చి పోయి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు

# ప్రజల కు సువర్ణ పాలన అందిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

## - ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్



తుగ్గలి,14 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రం లో ప్రజల కు సువర్ణ పాలన అందిస్తున్నారని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్ అన్నారు. శుక్రవారం రాతన కొత్తూరు గ్రామం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కెఈ శ్యామ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి గా నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించిన తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రహదారు అన్నింటికీ మరమ్మతులు చేయించడం జరిగిందన్నారు. ఎన్నికల హామీల లో భాగంగా ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ లు, వృద్యాప వితంతు పింఛన్లు రూ 4 వేలకు, వికలాంగుల పింఛన్లు రూ 6 వేలు కు ,అనారోగ్యంతో ఉన్న వారికి పింఛన్లు రూ 15 వేలు కు పెంచడం జరిగిందన్నారు. అలాగే ఉచిత గ్యాస్ సిలిండర్లు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. ముఖ్యంగా గ్రామాలలో సిమెంట్ రోడ్లు డ్రైనేజ్ నిర్మాణ పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి మనోహర్ చౌదరి, టిడిపి నాయకులు కృష్ణమూర్తి చౌదరి, రాతన కొత్తూరు పాండు, రాతన కొత్తూరు, కోటేశ్వరరావు, సుంకన్న, వన్నూరప్ప, నాగేష్ ,ఆవుల రాముడు, పులికొండ, రాతన ఈరన్న స్వామి, మై రాముడు, వెంకటపతి, శ్రీనివాసులు గౌడు, తిరుపాల్ నాయుడు వెంకట్రామ చౌదరి,మామిల్లకుంట ఎడవలి తిమ్మప్ప, గిరిగేట్ల సత్య ప్రకాష్, కొత్తూరు పాండు, కోటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ లు శ్రీనివాసులు, కురువ దేవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా మహిళ జిల్లా జడ్జి పై దాడి చేయడం సరైన పద్ధతి కాదని దమ్మపేట బార్ అసోసియేషన్ ఖండించారు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,14 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): దమ్మపేట మండలం కోర్టులో బార్ అసోసియేషన్ అధ్యక్షుల సమక్షంలో ఈరోజు రంగారెడ్డి జిల్లా కోర్టులో జిల్లా జడ్జిగా విధులు నిర్వహిస్తున్న మహిళ న్యాయమూర్తి గారి కరణ్ సింగ్ అనే వ్యక్తి కి శిక్ష పడిందన్న ఆవేశంతో చెప్పును జడ్జి గారి మీదకు చెప్పును విసిరి దాడి చేశాడు ఈ సంఘటన న్యాయ వ్యవస్థ పైన జరిగిన ఒక భయంకరం మైన దాడిగా భా విస్తూ ఈ దాడిని ఖండిస్తూ దమ్మపేట వార్ అసోసియేషన్ యొక్క అధ్యక్షులు ఈరోజు కోర్టుకు వెళ్లకుండా బహిష్కరించే నిరసన తెలపడం జరిగింది జడ్జిలకే రక్షణ లేకపోతే ఇంకా ప్రజలకు రక్షణ ఏముంటుంది దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి ఇటువంటి జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నాం ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు మారం సతీష్ కుమార్ సీనియర్ న్యాయవాది ఉడతనేని శ్రీనివాసరావు గొంది మురళి మోహన్ లక్కినేని నరేంద్ర త్రినాధ్ సంజయ్ తామ బాలరాజు ముప్పిడి శ్యామ్ సుధాకర్ గొల్ల భవాని గొంది సంధ్యారాణి తనగాల అరుణ కుమారి సొరస కృష్ణవర్ధన్ తదితరులు పాల్గొన్నారు

# ఇల్లందు డిఎస్పి గారి ఆధ్వర్యంలో కోయగూడెం ఓసి నందు పనిచేసేటువంటి ఆఫీసర్లు మరియు సిబ్బందికి అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగినది.



ఇల్లందు,14 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): ఇట్టి సమావేశంలో డిఎస్పి గారు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో జరిగే దొంగతనాల గురించి, దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించినారు, ఇట్టి కార్యక్రమంలో సీసీ కెమెరాలు యొక్క ప్రాముఖ్యతను, దొంగతనాల గురించి సింగరేణిలో పనిచేసే సెక్యూరిటీ సిబ్బందికి పలు సూచనలు అందించారు, అదేవిధంగా ప్రస్తుతం సమాజంలో జరుగుతున్నటువంటి సైబర్ నేరాలు, రోడ్డు భద్రత మరియు డ్రగ్స్, ఇల్లీగల్ యాక్టివిటీస్ గురించి అవగాహన కల్పించడం జరిగింది ఇట్టి సమావేశంలో ఇల్లందు డిఎస్పి N చంద్రబాను గారు , టేకులపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ టి సురేష్ గారు, బోడు ఎస్సై పి శ్రీకాంత్, కోయగూడెం ఓసి ప్రాజెక్టు మేనేజర్ సౌరబ్ సుమన్, డిప్యూటీ మేనేజర్ రవికుమార్, అండర్ మేనేజర్ మధుసూదన్, సెక్యూరిటీ ఇన్చార్జ్ అంజిరెడ్డి పాల్గొన్నారు

# నేడు సద్గురు సంత్ శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ జయంతి ఉత్సవాలు. బిజెపి లక్ష్మీదేవి పల్లి మండల అధ్యక్షుడు మాలోత్ గాంధీ నాయక్



లక్ష్మీదేవి పల్లి,14 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): బంజారాల ఉద్ధరణకు శాఖాహారిగా, బ్రహ్మచారి గా, సంఘసంస్కర్త గా, ఆద్యాత్మిక గురువుగా ఎన్నొ బోధనలతో బంజారాల మనో ధైర్యాన్ని పెంచిన సద్గురు సంతు శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ని శనివారం జరుపుకోవడం జరుగుతుందని ఈ వేడుకలను అందరూ విజయవంతం చేయాలని లక్ష్మీదేవి పల్లి మండలం బిజెపి అధ్యక్షుడు మాలోత్ గాంధీ నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ బంజారాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. దేశ హితంకోసం కష్టకాలంలో గోవుల సహకారంతో 'లదనీ' రవాణా వ్యవస్థను స్థాపించి, కొత్త కొత్త దారులు ఏర్పరచుకుంటు ఆహారధాన్యాలు, వాస్తు సామాగ్రిని ప్రజలకు, రాజులకు, ఆయుధాలను సైనికులను సమయానికి అందించి మన్ననలు పొందారని చెప్పారు. బంజారాలు దేశ నిర్మాణం, రక్షణ, పురోగతిలో చేసిన కృషి, సేవలు, త్యాగాలు, వారి ఆధ్యాత్మిక గురువుల ధార్మికత, వైవిద్యభరిత జీవనంలోని సంస్కృతి వారసత్వ సంపద గణనీయమైనది. అచంచల దేశ భక్తితో బంజారాలు ఆంగ్లేయుల అరాచకాలను తీవ్రంగా ప్రతిఘటించినందుకు వారిని క్రిమినల్ ట్రైబల్స్ చిత్రీకరించి, వారి జీవన ఆధారమైన లద్ధిని వ్యవస్థను ధ్వంసం చేసి, మాన, ప్రాణాలను హరించారు. ఇలాంటి తరుణంలో జగదాంబ మాత అనుగ్రహంతో శ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ బంజారా జాతిలో 15 ఫిబ్రవరి, 1739లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని గుత్తిలో జన్మించారు. బంజారాల ఉద్ధరణకు శాఖాహారిగా, బ్రహ్మచారి గా, సంఘసంస్కర్త గా, ఆద్యాత్మిక గురువుగా ఎన్నొ బోధనలతో బంజారాల మనోధైర్యాన్ని పెంచుతూ, సమాజంతొ పాటు ముఖ్యంగా బంజారాలలో , పరివర్తన, సంస్కరణకు తను ఒక ప్రయోగశాలగా మారి, బంజారాల ఉన్నతికి తన జీవితాన్ని జాతికి అంకితం చేసారు. త్యాగదనులైన శ్రీ సేవాలాల్ బంజారాల ఆరాధ్యదైవంగా సద్గురు సంత్ శ్రీ సేవా లాల్ మహారాజ్ గా దేశంలోని 12 కోట్లు, విదేశాల లోని బంజారాలచే నిత్యం భోగ్ భండారోతో పూజించ బడుతున్నాడు. వేల సంవత్సరాలుగా దాగి ఉన్న బంజారాల విశిష్టతను అక్టోబర్ 2024లో మహారాష్ట్రలోని పౌరదేవి లో, ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ బంజారాల విశిష్టతను ప్రపంచానికి ప్రకటిస్తూ, సభలో హాథిరాం బావాజీ, సంత్ సేవాలాల్ మహారాజ్, రాంరావు మహారాజ్ వంటి ఆధ్యాత్మిక మహనీయుల సేవలను కొనియాడారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్, జయంతి (15ఫిబ్రవరి)ని అధికారికంగా గుర్తించి ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా నిర్వహించాలని కోరారు. అదేవిధంగా ఫిబ్రవరి 17వ తారీఖున ఎదురుగడ్డలో నిర్వహించే సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు

# దామోదరం సంజీవయ్య గారు శ్రమ జీవి వారి అడుగు జాడలలో అందరం శ్రమిద్దాం

## జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్



పాడేరు, అల్లూరి సీతారామరాజు జిల్లా ,14 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): దామోదరం సంజీవయ్య గారు చాల శ్రామిక జీవి అని, అత్యంత పేద తరగతి కుటుంబం నుండి వచ్చిన సంజీవయ్యగారు స్వయం కృషితో ఎంతో ఎత్తుకు ఎదిగి ముఖ్యమంత్రి పదవిని అలంకరించారని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ కొనియాడారు. అటువంటి మహనీయుని స్ఫూర్తిగా మనమందరం ప్రజల కోసం శ్రమించాలని సూచించారు. శుక్రవారము దామోదరం సంజీవయ్య జయంతిని పురష్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టరేట్ మినీ సమావేశ మందిరమలో ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సంజీవయ్య గారు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రిగా, తొలి దళిత ముఖ్యమంత్రిగా ఖ్యాతి పొందారని తెలిపారు. 38 సంవత్సరాల అతి చిన్న వయసులో ముఖ్యమంత్రి అయిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. సంజీవయ్య పశువులను కాయడంతో సహా జీవనోపాధికి చిన్నా చితక ఉద్యోగాలు చేశారని గుర్తు చేసారు. 2008 లో విశాఖపట్నంలో స్థాపితమైన ఆంధ్ర ప్రదేశ్ నేషనల్ లా యూనివర్సిటీకి ఆయన జ్ఞాపకార్థం 2012 లోదామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ అని పేరుమార్చారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో అనేక మంత్రి పదువులు నిర్వహించి పేరు ప్రఖ్యాతలు సాధించారని గుర్తు చేసారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పద్మ లత, ల్లా సాంఘిక సంక్షేమ అధికారి జనార్ధన రావు, డిఇఓ పి. బ్రహ్మాజీ రావు, ఉద్యాన వ్యవసాయ జిల్లా అధికారులు ఎస్బి ఎస్ నంద్, రమేష్ కుమార్ రావు, డిపిఆర్ఓ పి. గోవింద రాజులు, కలెక్టరేట్ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా మెడికల్ కళాశాల ఖాళీల భర్తీ వదంతులు నమ్మి మోస పోవద్దు

## పరిశీలనకు ప్రత్యేక కమిటీ జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్



పాడేర,14 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 34 కేటగిరీలలో ఖాళీగా ఉన్న 244 పోస్టులను అత్యంత పారదర్శకంగా భర్తీ చెయడ0 జరుగుతుదని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ప్రకటించారు. పోస్టులు అమ్ముకుంటున్నారన్న వదంతులు తన దృష్టికి వచ్చిందని, అటువంటి వదంతులు ఎవ్వరూ నమ్మవద్దని, ఎవరూ ఎవరికీ డబ్బులు ఇచ్చి మోస పోవద్దని సూచించారు. ప్రభుత్వ నిభంధనల ప్రకారం నోటిఫై చేసిన పోస్టులను రోస్టర్ అనుసరించి మాత్రమె ఖాళీలు భర్తీ చేయడం జరుగుతుందన్నారు. నియామక0, మరియు ధృవపత్రాల పరిశీలనకు ఒక నోడల్ అధికారి ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్ధుల మార్భ్ లిస్టులు, అనుభవం తదితర అంశాల ఆధారంగా మెరిట్ లిస్టు ప్రకటించడం జరుగుతుందని, మెరిట్ లిస్టు ప్రకారమే తుది జాబితా ప్రకటించి భర్తీ చెయడ0 జరుగుతుందని కలెక్టర్ వివరించారు. వదంతులను, రూమర్లను నమ్మవద్దని, ఎవరైనా డబ్బులు అడిగినట్లు తెలిస్తే కళాశాల ప్రిన్సిపాల్ కు వ్రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే వారిపై కటిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

# పునరావాస కాలనీల విజిట్ చేస్తున్న సబ్ కలెక్టర్ మరియు ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేట్ అధికారిని దృష్టికి సమస్యలు తీసుకువెళ్లిన జనసేన మండల అధ్యక్షుడు సారపు వెంకటరాయుడు



అల్లూరి సీతారామరాజు జిల్లా ,14 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం దేవీపట్నం మండలంలో గల ముసునిగుంట పునరావాస కాలనిలో ఈరోజు సబ్ కలెక్టర్ మరియు ప్రొజక్ట్ అడ్మినిస్ట్రేట్ దవళేశ్వరం వారు నిర్వశితుల సమస్యలు పైన వినతులు తీసుకున్నారు. 44గ్రామాల పునరావాస కాలనీలలో పూర్తి స్థాయిలో సౌకర్యలు కల్పించాలేదని, ప్రభుత్వ కళాశాల నిర్మాణం ఇప్పటికి లేదని స్కూల్ భవనం లో విద్యాభోదన సౌకర్యల మధ్య సాగుతుందని జిల్లాలో రెండు సార్లు మొదటి స్థానం రాగ మరొకసారి రెండవ స్థానం వచ్చింది స్థలం కేటాయించిన నిర్మాణం లేదని మరియు ప్రధానంగా కొన్ని గ్రామాలకు స్మశాన వాటిక కేటాయించలేదు కేటాయించిన వాటికి సౌకర్యలు లేవని,ప్రభుత్వం ఇచ్చిన బ్లూ ప్రింట్ లో ఇచ్చినటువంటి 26కాలంస్ లో కేవలం 10నుంచి 15లోపే నిర్మించారాని బిల్లులు డ్రచేసారని అలానే గ్రామాల్లో చనిపోయిన వారికి సంబందించినటువంటి ఇంటి పట్టాలను కానీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కానీ వారి కుటుంబ సభ్యులకు ఇవ్వలేదని,స్కూల్ భవనాలు, అంగన్వాడి భవనాలు లేవని, డీ పట్టాలకు నష్టపరికరం మరియు భూ నష్టపరిహారం కానీ భూమికి భూమి కేటాయింపు కాలేదని చాలా మంది యువతి యువకులకు ఆర్ %ఉ% ఆర్ కానీ పునరావాసలు కానీ ఇవ్వలేదని వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టి కమిటీ వేసి నిర్వశితులకు న్యాయం చెయ్యాలని జనసేనపార్టీ మండల అధ్యక్షులు చారపు వెంకటరాయుడు తెలియచేసారు.

# పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు చిన్నంశెట్టి



భద్రాద్రి కొత్తగూడెం,14 ఫిబ్రవరి ( క్రాంతిన్యూస్ ): ముళ్ళపూడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం దమ్మపేట గ్రామంలో ఈరోజు సోమవారపు మనోజ్ – పూజిత దంపతుల కుమార్తె మొదటి పుట్టినరోజు జరుపుకుంటున్న సేశ్విక హన్వి పాపను ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ దమ్మపేట మండలం నాయకులు చిన్నంశెట్టి సత్యనారాయణ ముళ్ళపూడి వెంకటేశ్వరరావు పాస్టర్ దేవయ్య గారు కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు చిన్నంశెట్టి మధు చిన్నంశెట్టి సురేష్ తదితరులు పాల్గొనడం జరిగింది

# పెళ్లికి ఆహ్వానించిన చిట్టెం దంపతులు



మక్తల్,14 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): కల్వకుంట్ల చంద్రశేఖర రావు దంపతులను ఆహ్వాన పత్రిక అందజేసిన మక్తల్ మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఈనెల 23వ తేదీన హైదరాబాదులో జరుగుతున్న మక్తల్ మాజీ శాసనసభ్యులు చిట్టెం రామ్మోహన్ రెడ్డి చిట్టెం సుచరితగార్ల చిన్న కుమారుడు పృథ్వీశ్ రెడ్డి వివాహ మహోత్సవానికి గౌరవ తెలంగాణ రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు దంపతులను మరియు కవితను ఆహ్వానిస్తూ పెళ్లి పత్రికలు అందజేసిన చిట్టెం దంపతులు

# సమ్మక్క సారలమ్మ లను దర్శించుకున్న

## అశ్వరావుపేట నియోజవర్గం నాయకురాలు ఒగ్గిల పూజ



భద్రాద్రి కొత్తగూడెం,14 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): చంద్రుగొండ అశ్వరావుపేట నియోజవర్గం చంద్రుగొండ మండలం బెండలపాడు గ్రామం శివారు చిలకల గట్టు నందు జరుగుతున్న సమ్మక్క సారలమ్మల జాతర మహోత్సవంలో పాల్గొనీ వగ్గిల పూజ ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా కమిటీ సభ్యులు పూజా నీ సాదరంగా ఆహ్వానించినారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మేడా మోహన్ రావు సొసైటీ వైస్ చైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ మాజీ సర్పంచ్ లు పూస0 వెంకటేశ్వర్లు కుంజ సావిత్రి మాజీ ఎంపీటీసీలు కారం రాధా కారం వెంకటేశ్వర్లు సత్తి నాగేశ్వరరావు మారుతి సత్యనారాయణ మాజీ ఉపసర్పంచ్ పదం వెంకట్ రాములు చల్లా జానకి రాములు కాక లక్ష్మయ్య కారం నరసరావు వరస వీరభద్రం కాకా సురేష్ తేజావత్ వెంకన్న ఆంగోత్ లక్ష్మణ్ కంటి బుల్లయ్య పోడియం రాఘవయ్య తూర్పాక నరసింహారావు తూర్పాక పున్నమయ్య బండి రామకృష్ణ కనితి శ్రీను భూక్య రవి పెద్ద0 వెంకటేశ్వర్లు ఇరప భద్రయ్య కడియం నరసింహారావు పద్దం యశోద కంటి ఆదెమ్మ కనితి పుల్లమ్మ కారం ఉష చీదరపోతమా తేజావత్ వెంకన్న తేజవాత్ శీను యువ నాయకులు శ్రావణ్ బాద్షా బానోత్ రాజ్ కుమార్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూడాలి.

## గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ లో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

క్రాంతిన్యూస్ : ఇల్లందు మండలం రొంపేడు గ్రామం గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీలతో ముచ్చటిస్తూ వారికి అందుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. డైనింగ్ హాల్, క్లాస్ రూమ్లు, పరిసరాలు, స్టోర్స్, వంట గదులను తనిఖీ చేసి సమస్యలను అడిగి స్వయంగా రాసుకున్నారు. ఈ తనిఖీలు భాగంగా తరగతి గదిలో విద్యార్థినీలతో మమేకమై విద్యార్థులు ఎలా చదువుతున్నారు? టీచర్లు పాఠాలు ఎలా చెపుతున్నారు? పాఠ్యాంశాల బోధన పట్ల అవగాహన కలుగుతుందా? మీరు ఎంచుకున్న లక్ష్యాలు ఏమిటి? మోనూ ఎలా ఉంది? అని తదితర విషయాలపై కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థినిలు చదువుపై శ్రద్ధ చూపి ఉన్నత శిఖరాలను అవరోధించాలని, వసతి గృహంలో కానీ పాఠశాలలో కానీ ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తమ దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలకు స్వచ్ఛమైన, రుచికరమైన ఆహారం అందించాలని ఆహారం వన్డే సిబ్బంది పరిశుభ్రంగా చేతులు కడుక్కొని ఆహార పదార్థాలను సిద్ధం చేయాలన్నారు. స్వచ్ఛమైన త్రాగు నీరు అందించాలని, నిరంతరం విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని, ప్రతి విద్యార్థినీకు వ్యక్తిగత, పరిశుభ్రత, మానసిక వికాసం కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించి వారిని గమనిస్తూ అవగాహన కల్పించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం వారికి వైద్య పరీక్షలు



నిర్వహించాలన్నారు. ప్రతి సబ్జెక్టు పై ఎలాంటి సందేహాలు ఉన్న సమాధానాలు చెబుతూ విద్య బోధనలు అందించాలని సూచించారు. వసతి గృహాలలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వార్డెన్లు, ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు నిత్యం గమనిస్తూ ఉండాలని ఆదేశించారు. విద్యార్థులు సౌకర్యవంతంగా చదువుకోవటానికి అన్ని సదుపాయాలు కల్పించాలని, దానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ అధికారుల ను ఆదేశించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట ఇల్లందు తాసిల్దార్ రవికుమార్, హాస్టల్ వార్డెన్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సాయి ఎక్సలెంట్ స్కూల్ నందు డార్విన్ పరిణామ క్రమంపై అవగాహన సదస్సు



క్రాంతిన్యూస్ :జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక సాయి ఎక్సలెంట్ స్కూల్ పాపకొల్లు రోడ్డు జూలూరుపాడు నందు జన విజ్ఞాన వేదిక బాధ్యులకు ఏర్పాటుచేసిన ఓరియంటేషన్ ప్రోగ్రాంలో లాయర్ మక్కడ మాట్లాడుతూ పిల్లల లో ముడనమ్మకలుతొలగిపోయే బావి భారత పౌరుల గా నేటి తరానికి బంగారు భవిష్యత్తు ఏర్పడేలా చెయ్యాలని ఆయన వివరించారు అదేవిధంగా పాఠశాల ప్రిన్సిపల్ అరెబోయిన కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యార్థులను చైతన్య వంతులుగా తీర్చిదిద్దే విధంగా మంచి విద్య నీ అందిస్తూ బట్టి పట్టి చదివే విధానం ను పిల్లల లో తొలగించి లెసన్స్ పై అవగాహన వచ్చేవిధంగా యోగ కార్యక్రమాలు మరియు ఆటలు పాటలు కో సర్క్యులర్ కార్యక్రమాలు పాఠశాల లో నిర్వహిస్తూ ప్రతి విద్యార్థి లో మానసిక ఉల్లాసం పెంచేలా చెయ్యడమే మ కర్తవ్యం గా భావిస్తున్నాము కావున నేటి బాలలే రేపటి పౌరులుగా తీర్చిదిద్దాలని అనేది మా సాయి ఎక్సలెంట్ స్కూల్ యొక్క ముఖ్య ఉద్దేశం అదేవిధంగా తన చుట్టూ ఉన్న



వాతావరణ జీవన శైలిని మార్చుకునేవిధంగా తయ్యారు చేస్తాము అని ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన సదస్సు ద్వారా వివరించడం జరిగినది అదేవిధంగా ఈ కార్యక్రమంలో అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు వారిలో ముఖ్యులు రాష్ట్ర బాధ్యురాలు ఎ.కస్తూరి , జె. వి. వి . జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్ రావు , జె.వి.వి . జిల్లా శాఖ సెక్రెటరీ సి.హెచ్.తిరుమల పాలు మొదలైన వారు పాల్గొన్నారు.

# కుల గణన సర్వే ను పొడిగించడం హర్షనీయం

**కుల గణన తప్పులు లేకుండా తప్పులు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాన్నిదే**

**రెండో విడత సర్వే ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

**సేవ్ కొత్తగూడెం సేవ్ మున్సిపాలిటీ కన్వీనర్ జలాల్**



క్రాంతిన్యూస్ :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కుల గణన సర్వే కు మరోసారి అవకాశం కల్పించడం హర్షనీయం అని సేవ్ కొత్తగూడెం సేవ్ మున్సిపాలిటీ కన్వీనర్ జలాల్ అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక నిర్ణయాల్లో దూకుడుగా వ్యవహరించినప్పటికీ ప్రజలు ప్రజాస్వామ్య వాదుల విజ్ఞప్తుల మేరకు వారి నిర్ణయాలు పునర్ సమీక్షించుకొని ప్రజాస్వామ్య బద్ధంగా ముందుకు వెళుతుండడం స్వాగతించాల్సిన అంశమే అని ఆయన తెలిపారు. సర్వేలో అనేకమంది పాల్గొనడంతో మరోసారి అవకాశం కల్పించడానికి ప్రజలు కుల సంఘాలు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి సర్వేలో పాల్గొనేలా చేయాలని ఆయన తెలిపారు. ప్రభుత్వం ప్రభుత్వాది అధికారులు జిల్లా స్థాయిలో రాష్ట్రస్థాయిలో కుల సంఘాల వద్ద ఉన్న డేటాను కూడా తీసుకొని కుల గణనలో పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని ఆయన కోరారు. కుల గణన ప్రకారం రాష్ట్రంలో ఎవరి వాటా ఎంతో తేల్చి ఉద్యోగాలలో సంక్షేమ పథకాలలో రాజకీయ పదవులలో సమన్యాయం చేయాలని ఆయన ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు

# న్యాయమూర్తి పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించిన గూడెం బార్ అసోసియేషన్

## న్యాయమూర్తి పై జరిగిన దాడికి సంఘీభావంగా విధులు బహిష్కరణ




క్రాంతిన్యూస్ :రంగారెడ్డి జిల్లాలో న్యాయమూర్తి పై జరిగిన దాడికి నిరసనగా వారికి సంఘీభావం తెలుపుతూ ఏకగ్రీవంగా కొత్తగూడెం అసోసియేషన్ విధులు బహిష్కరించింది .ఈ సంఘటను తీవ్రంగా ఖండించి ,భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. శుక్రవారం బార్ అసోసియేషన్ హాల్లో జరిగిన అత్యవసర సమావేశంలో సభాధ్యక్షులు, అసోసియేషన్ ఉపాధ్యక్షులు తోట మల్లేశ్వరరావు , ప్రధాన కార్యదర్శి రవిచంద్ర లు మాట్లాడుతూ రంగారెడ్డిలో న్యాయమూర్తి పై జరిగిన దాడిని మొత్తం న్యాయవ్యవస్థపై జరిగిన దాడిగా భావిస్తూ ఈ దాడిని కొత్తగూడెం బార్ అసోసియేషన్ గా తీవ్రంగా ఖండిస్తున్నామని వారన్నారు. దాడికి సంఘీభావంగా ఏకగ్రీవంగా సమావేశం తీర్మానం చేసి విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు కటకం పుల్లయ్య మాట్లాడుతూ ఇలాంటి దాడులు సామాన్యులకు న్యాయవ్యవస్థపై నమ్మకం లేకుండా సామాన్య ప్రజలు బయాందోళనకు గురయ్యే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు ఏ కరుణాకర్, ఎస్ ప్రవీణ్ కుమార్, సీనియర్ న్యాయవాదులు జలసూత్రం శివరాంప్రసాద్, జీవీకే మనోహర్ రావు, వివి సుధాకర్ రావు ,పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగిరెడ్డి, మల్లెల ఉషారాణి, మునిగడప వెంకటేశ్వర్లు, మారపాక రమేష్, మనుబోతుల సత్యనారాయణ , కె నాగేశ్వరరావు ,ఎన్వి రాజేష్, రావిరాల రామారావు తదితరులు పాల్గొన్నారు.




## ఆకెనపల్లి గ్రామ నిరుపేద మహమ్మద్ ఫరీదా కుటుంబ సభ్యులకు 25 కిలోల బియ్యం మరియు 5 కిలోల నూనె అందజేసిన:-గాదె సుధాకర్



క్రాంతిన్యూస్ :అంతర్గాం మండలం ఆకెనపల్లి గ్రామం లో కొన్ని రోజుల క్రితం అనారోగ్యం తో మహమ్మద్ ఫరీదా మరణించగా గాదె సుధాకర్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, మహ్మద్ ఫరిదా కు శ్రద్ధాంజలి ఘటించి, దశ- దిన కార్యక్రమానికి 25 కిలోల బియ్యంతో పాటుగా 5 లీటర్ల నూనె అందజేశారు ఈ కార్యక్రమం లో ముదిరాజ్ కుల సంఘం నాయకులు ఐలవేణి లింగయ్య ,రాయిల్ల లింగయ్య, ఐలవేణి భీమయ్య, గాదె భూమయ్య, లగిశెట్టి శంకర్,ఉత్తమ్ పోచయ్య,స్ రమణయ్య, ఈర్ల మల్లేస్,మామిడాల రాయబోసు భాదిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# లాల్ బహుదూర్ కళాశాల లో ఈరోజు ఎన్ఎస్ఎస్ విభాగంలో రెడ్ రిబ్బన్ క్లబ్ ను పునస్కరించుకొని....

## ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల సంఘీభావానికి చిహ్నంగా, మాదక ద్రవ్యాల నిరోధం, మద్యం సేవించి వాహనాలు నడపడం...




క్రాంతిన్యూస్ : స్థానిక లాల్ బహదూర్ కళాశాలలో ఈరోజు ఎన్ఎస్ఎస్ విభాగం లు రెడ్ రిబ్బన్ క్లబ్ ను నిర్వహించడం జరిగింది... ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె రాజేందర్ రెడ్డి, అధ్యక్షతన వహించగా ముఖ్య అతిథిగా కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె ప్రతాపరెడ్డి హాజరై విద్యార్థులకు ది రెడ్ రిబ్బన్. ... ఎయిడ్స్ వ్యాధిగ్రస్థుల సంఘీభావానికి చిహ్నంగా, మాదక ద్రవ్యాల నిరోధం, మద్యం సేవించి వాహనాలు నడపడం.. అంటూ ఎయిడ్స్ (హెచ్ఐవి) హ్యూమన్ ఇమ్యునో డెఫిషియెన్సీ వైరస్. మీ శరీరం ఇన్ఫెక్షన్‌తో పోరాడటానికి సహాయపడే ఒక రకమైన తెల్ల రక్త కణాలను నాశనం చేయడం ద్వారా హెచ్ఐవి మీ రోగనిరోధక వ్యవస్థకు హాని చేస్తుంది... ఇది ఇతర ఇన్ఫెక్షన్లు మరియు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది అంటూ అవగాహన కలిగించారు.. అతిథిగా డాక్టర్: బి సాంబశివరావు డిఎం, హెచ్ ఓ వరంగల్, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.. ప్రొఫెసర్ ఈసంనారాయణ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కాకతీయ విశ్వవిద్యాలయం వారు విద్యార్థిని ఉద్దేశించి సంభాషించారు.. మరియు శ్రీ జి రమేష్, అసిస్టెంట్ డైరెక్టర్ టిజిఏసిఎస్ హైదరాబాద్, మరియు డాక్టర్ ఎం రాంబాబు, డిస్టిక్ కన్వీనర్ ఎన్ఎస్ఎస్ మరియు ఎస్ శ్రీనివాస్, డిస్టిక్ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ హనంకొండ మరియు కెప్టెన్ డాక్టర్: ఎం సదానందం యన్ సి సి ఆఫీసర్ లాల్ బహుదూర్ కళాశాల మరియు స్వప్న మాధురి, డిస్టిక్ ప్రాజెక్ట్ మేనేజర్ వరంగల్ మరియు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్: రాఘవేందర్ రెడ్డి, హింగే రాజేశ్వరరావు, ఉమ్మగొని శ్రీనివాస్ మరియు కళాశాల అధ్యాపక అధ్యపకేతర మరియు విద్యార్థి మరియు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారూ...

క్రాంతి KR TV
# ఆరోగ్య క్రాంతి
శనివారం 15 ఫిబ్రవరి 2025
epaper.krtvnews.com

## రోజు నెయిల్ పాలిష్ వేసుకుంటున్నారా?
## ఈ అందం ఆరోగ్యానికి ప్రమాదమే..

హెల్త్ న్యూస్,14 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):మహారాణికి కిరీటింలా చేతుల అంచున గోళ్లను తళుక్కున మెరిసేలా చేస్తాయి. చేతుల అందానికి సరికొత్త సొబగులు అద్దుతాయి. ఐతే అందం వెనుక ప్రమాదం ఉందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. గోళ్ల అందం కోసం తరచూగా నెయిల్ పెయింటింగ్ వేసుకుంటే వివిధ అనారోగ్య సమస్యలు తప్పవని స్పష్టం చేస్తున్నారు.



**నెయిల్ పాలిష్ రెండు కోట్లు :** పార్టీ, ఫంక్షన్ ఇలా శుభకార్యం ఏదైనా మేకప్ వేసుకునేందుకు మహిళలు మక్కువ చూపిస్తారు. ఇందులో గోళ్ల అలంకరణకు సైతం ప్రాధాన్యమిస్తారు. చీరలు, డ్రెస్సులకు మ్యాచ్ అయ్యేలా వాటిని అలంకరించేందుకు శ్రద్ధ చూపిస్తుంటారు. గోళ్ల అందం కోసమే నెయిల్ పాలిష్, నెయిల్ టాటూ, నెయిల్ ఆర్నమెంట్స్ ఆర్టిఫీషియల్ నెయిల్స్, పాలిజెల్ నెయిల్స్ రోజుకో పద్ధతి పుట్టుకొస్తోంది. ఎక్కువగా నెయిల్ పాలిష్‌లే వినియోగించినా, నెయిల్ ఎక్స్ టెన్షన్లకు మంచి డిమాండ్ ఉంది. సాధారణంగా గోళ్ల రంగుల ఖరీదు 40 నుంచి 50 రూపాయల వరకు ఉంటుంది. కాస్త ఖరీదైనవైతే వందల నుంచి వేలల్లో ఉంటాయి. బ్లాక్ డైమండ్స్‌తో రూపొందించిన అజాచర్ నెయిల్ పాలిష్ ఏకంగా రెండు కోట్ల రూపాయల వరకు పలకింది. ఓ నెయిల్ పాలిష్ ఇంత ఖరీదులో తయారు చేశారంటేనే వీటికి ఉన్న డిమాండ్‌ని అర్థం చేసుకోవచ్చు.

**అనారోగ్య సమస్యలు తల్లెత్తే ప్రమాదం :** ఐతే ఈ అందం వెనుక ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. నెయిల్ ఆర్ట్‌లు, నెయిల్ పాలిష్‌లను తరచూ వేసుకోవటం, రిమూవర్స్‌ని వినియోగించటం అంత మంచిది కాదని హెచ్చరిస్తున్నారు. గోళ్లపై అందంగా స్ప్రెడ్ అవ్వటం, ఎక్కువ కాలం అతుక్కుని ఉండటం, కలర్, మెరుపుల కోసం నెయిల్‌పాలిష్‌లలో వివిధ రకాల రసాయనాలు వినియోగిస్తుంటారు. రంగుల్లో వాడే పారాబెన్స్ వల్ల హార్మోన్ వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉందని చెబుతున్నారు. మానిక్యూర్ సమయంలో గోరు పైభాగంలో ఉండే క్యూటికల్ అనే పొర తొలగిపోయి బ్యాక్టీరియా, ఫంగస్ శరీరంలోకి ప్రవేశించి ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉందని చెబుతున్నారు. చిన్నపిల్లలు రంగు వేసుకున్న వేళ్లను నోట్లో పెట్టుకోవటం వల్ల అనారోగ్య సమస్యలు తల్లెత్తే ప్రమాదం ఉందంటున్నారు.

**తల్లిబిడ్డ ఆరోగ్యానికి ప్రమాదం :** నెయిల్ ఆర్ట్ సమయంలో వాడే లేజర్ లైట్లు చర్మంపై తీవ్ర ప్రభావం చూపుతాయని, ఎక్కువ సేపు నెయిల్ పాలిష్ వాసన పీల్చటం వల్ల శ్వాసకోస సంబంధిత సమస్యలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. గర్భిణులు తరచూ నెయిల్ పాలిష్ వేసుకోవటం వల్ల తల్లిబిడ్డ ఆరోగ్యానికి ప్రమాదం కలిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

**వాడకపోవటమే మంచిది :** నెయిల్ పాలిష్ వాడేప్పుడు నాణ్యమైన వాటిని ఎంచుకోవటం తరచూ నెయిల్ పాలిష్, ఆర్ట్‌లను వినియోగించకుండా ఉండటం వల్ల దీని ప్రభావం కొంత తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. వీలైనంత వరకు గర్భిణులు, చిన్నపిల్లలకు నెయిల్ పాలిష్ వాడకపోవటమే మంచిదని సూచిస్తున్నారు.

“రంగుల్లో వాడే పారాబెన్స్ వల్ల హార్మోన్ వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉంది. మానిక్యూర్ సమయంలో గోరు పైభాగంలో ఉండే క్యూటికల్ అనే పొర తొలగిపోయి బ్యాక్టీరియా, ఫంగస్ శరీరంలోకి ప్రవేశించి ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది. చిన్నపిల్లలకు అనారోగ్య సమస్యలు రావచ్చు. ఎక్కువ సేపు నెయిల్ పాలిష్ వాసన పీల్చటం వల్ల శ్వాసకోస సంబంధిత సమస్యలు వస్తాయి అని వైద్యులు చెప్తున్నారు .

## మునగ ఆకుల టీ ఒక్కసారి తాగి చూడండి

హెల్త్ న్యూస్,14 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): మునగ చెట్టు ఆకుల నుండి హెర్బల్ టీ తయారు చేస్తారు. ఈ టీ తాగితే ఆరోగ్యపరంగా అద్భుతమైన ప్రయోజనాలు కలుగుతాయి. అవేమిటో తెలుసుకుందాము.మునగ ఆకులులో పలు ఔషధీయ గుణాలున్నాయి.మునగ టీలో విటమిన్లు ఎ, సి, ఇ, అలాగే కాల్షియం, ఇనుము, ప్రోటీన్లు వున్నాయి.టీలో ఉండే యాంటీఆక్సిడెంట్ లక్షణాలు రోగనిరోధక శక్తిని బలపరుస్తాయి.ఈ మునగ ఆకు టీని క్రమంతప్పకుండా తాగడం వల్ల జీవక్రియ పెరుగుతుంది, ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది.మునగ టీ తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రించబడతాయి, ఇది దయాబెటిస్ రోగులకు ప్రయోజనకరంగా ఉంటుంది.ఇందులో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, మలబద్ధకం సమస్యను తొలగిస్తుంది.ప్రతిరోజూ మునగ టీ తాగడం వల్ల చర్మం కాంతివంతంగానూ, జుట్టు కూడా బలపడుతుంది.ఈ టీని రోజూ తీసుకోవడం వల్ల ఒత్తిడి తగ్గి మనసు ప్రశాంతంగా ఉంటుంది.



## నరాల బలహీనత తగ్గించే ఆహారాలు



హెల్త్ న్యూస్,14 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):మానవ శరీరంలో నరాలు కీలక పాత్ర పోషిస్తాయి. బ్రెయిన్ నుంచి శరీరంలోని అన్ని భాగాలకు సంకేతాలు పంపించడానికి నరాలు కీలకం. వీటి వల్ల నాడీవ్యవస్థ చాలా ఆరోగ్యంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. శరీరంలో అన్ని భాగాలకు అవసరమైన ఆక్సిజన్, పోషకాలు తీసుకెళ్లడంలో నరాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. అయితే, ఈ రోజుల్లో మారుతున్న జీవన శైలి, కాలుష్యం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లతో లేని పోని సమస్యలు తెచ్చుకుంటున్నారు. శరీరానికి కావాల్సిన పోషకాలు సరైన సమయానికి అందకపోతే రకరకాల వ్యాధులు వస్తాయి. అందులో నరాల బలహీనత కూడా ఒకటి.

దీర్ఘకాలిక తలనొప్పి, జ్ఞాపక శక్తి తగ్గిపోవడం, చేతుల కాళ్ల తిమ్మిరి, కండరాల బలం కోల్పోవడం వంటి లక్షణాలు ఎంత మాత్రం మంచిది కాదు. నరాల బలహీనత ఉంటే ఈ లక్షణాలు మీలో కనిపిస్తాయి. చెడు అలవాట్లు, ఒత్తిడి కారణంగా నరాల్లో రక్త సరఫరా సరిగ్గా జరగదు. దీంతో ఈ సమస్య తలెత్తుతుందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఈ సమస్య ఎదుర్కొనే వారు చాలా బాధ, నొప్పి భరిస్తూ ఉంటారు. అయితే, ఈ సమస్యను తగ్గించుకోవాలంటే కొన్ని ఆహారాల్ని భాగం చేసుకోవాలి. ఈ ఆహారాలు తింటే నరాల బలహీనత తగ్గుతుంది. ఇంతకీ ఆ ఫుడ్స్ ఏంటంటే

**క్వినోవా :** క్వినోవా తృణధాన్యాలకు చెందిన సూపర్ ఫుడ్. దీంతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. క్వినోవాలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. క్వినోవాలో పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. విటమిన్ బీ6, జింక్, ఫోలెట్, మాంగనీస్, ఐరన్, కాపర్ వంటివి మెండుగా ఉంటాయి. రోజువారి ప్రోటీన్ అందించడంలో క్వినోవా కీలక పాత్ర పోషిస్తుంది. క్వినోవాలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఈ పోషకాలన్నీ నరాల ఆరోగ్యం కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

**గుమ్మడి గింజలు :** గుమ్మడి గింజల్లో ఫైబర్, విటమిన్ ఏ, బీ, సీ ఈ తో పాటు కాల్షియం, ఫ్యాటీ యాసిడ్స్, పొటాషియం, జింక్, అమైనో యాసిడ్స్, ఫినోలిక్ సమ్మేళనాలు, ఫోలెట్, ఐరన్, ఫాస్పరస్ పుష్కలంగా ఉంటాయి. వీటిల్లో యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీమైక్రోబయల్, యాంటీ ఆర్థరైటిక్ లక్షణాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇవన్నీ నరాల రక్షణలో కీలక పాత్ర పోషిస్తాయి. అంతేకాకుండా ఇందులో ఉండే విటమిన్ బి-15 ఉంటుంది. ఇవి కండరాల ఆరోగ్యాన్ని రక్షిస్తాయి. ఈ గింజలు రోజూ తింటే.. నరాలు ఆరోగ్యంగా ఉంటాయని నిపుణులు అంటున్నారు.

**బ్లూ బెర్రీస్ :** బ్లూ బెర్రీస్‌లో పోషకాలు అధికంగా ఉంటాయి. యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్, విటమిన్లు, పొటాషియం ఎక్కువగా ఉంటాయి. బ్లూబెర్రీ పండ్లలోని యాంటీ ఆక్సిడెంట్లు మెదడుని ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇవి జ్ఞాపక శక్తి మెరుగుపర్చడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ పండ్లలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. ఇవన్నీ నరాలు దెబ్బ తినకుండా కాపాడతాయని నిపుణులు చెబుతున్నారు.

**సిట్రస్ ఫ్రూట్స్ :** సిట్రిక్ యాసిడ్ ఎక్కువగా ఉండే పండ్లను సిట్రస్ ఫ్రూట్స్ అంటారు. నిమ్మ, నారింజ, బత్తాయి, గ్రేప్ ఫ్రూట్ వంటి పండ్లు సిట్రస్ జాతికి చెందినవి. సిట్రస్ ఫ్రూట్స్‌లో ఎన్నో పోషకాలు, విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి. వీటిలో విటమిన్ సి, ఫ్లేవనాయిడ్స్, ఫైబర్, ప్లాంట్ కాంపౌండ్స్ ఉంటాయి. వీటిని తినడం వల్ల ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుంది. యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటో కెమికల్స్ వంటి పోషకాలు నరాలు దెబ్బ తినకుండా కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి.

**ఆకుకూరలు :** ఆకుకూరలు గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆకుకూరలు ఆరోగ్యానికి ఎంతో మంచివి. పాలకూర, తోటకూర, బచ్చలికూర, మెంతికూర, కొత్తిమీర, పుదీనా వంటి ఆకుకూరలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిలో పోషకాలు మెండుగా ఉంటాయి. వీటిలో విటమిన్ ఎ, సి, ఇ, కాల్షియం, ప్రోటీన్, ఐరన్, పొటాషియం ఉంటాయి. ఇవి ఇమ్యూనిటీ పవర్ పెంచడమే కాకుండా.. మెదడు ఆరోగ్యాన్ని కాపాడతాయి. అంతేకాకుండా రోజూ తింటే నరాల బలహీనత తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు.


**ఇవి కూడా తినాలి :** బాదం, జీడిపప్పు వంటి డ్రై ఫ్రూట్స్ తినాలి. వీటిలో మెగ్నిషియం ఎక్కువగా ఉంటుంది. వీటిని తినడం వల్ల నరాలకు ఉపశమనం లభిస్తుంది. అంతేకాకుండా తగిన విశ్రాంతి లభించడం వల్ల నరాలకు బలం చేకూరుతుంది.

సాల్మన్, మెకేరెల్ వంటి చేపల్ని ఎక్కువగా తినాలి. వీటిలో ఉంటే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ నరాల్ని బలంగా ఉంచుతాయి.

డార్క్ చాక్లెట్ కూడా నరాలకు తగిన విశ్రాంతిని కల్పిస్తుంది. డార్క్ చాక్లెట్‌లో ఎల్-ట్రిప్టోఫాన్ ఉంటుంది. ఇది మెదడు ఆరోగ్యానికి చాలా మంచిది.

## ఇంగ్లాండ్ ఓడిపోతుంటే

# డగౌట్‌లోనే నిద్రపోతావా ఆర్చర్



స్పోర్ట్స్ న్యూస్,14 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత్‌తో టీ20, వన్డే సిరీస్ ఆడిన ఇంగ్లాండ్.. దారుణంగా విఫలమైంది. ఐదు టీ20ల్లో ఒక్కదాంట్లో మాత్రమే గెలిచిన ఆ జట్టు.. మూడు వన్డేల్లో కనీసం ఖాతా కూడా తెరవలేకపోయింది. ఈ నేపథ్యంలో ఆ జట్టు ఆటతీరుపై ఇంగ్లాండ్ మాజీల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా భారత్ లాంటి జట్టుతో ఆడేటప్పుడు.. ఇలాగే ప్రిపేర్ అవుతారా అనే ప్రశ్నలు తలెత్తాయి. ఇంగ్లాండ్ ఆటగాళ్లలో గెలవాలనే కసి కనిపించలేదని పలువురు మాజీలు విమర్శలు గుప్పించారు.

ఇక ఓ పక్క ఇంగ్లాండ్ క్రికెట్ జట్టుపై విమర్శల వర్షం కొనసాగుతుండగానే.. తాజాగా ఓ వీడియో నెట్టింట చక్కర్లు కొడుతోంది. అగ్నికి ఆజ్యం పోసినట్లుగా.. ఆ వీడియోను చూసిన ఫ్యాన్స్.. ఇంగ్లాండ్ టీమ్‌ను తిట్టిపోస్తున్నారు. క్రికెట్ ఎందుకు ఆడతారయ్యా.. అని ప్రశ్నిస్తున్నారు.

ఆ వీడియోలో ఏముందంటే..

భారత్-ఇంగ్లాండ్ జట్ల మధ్య మూడో వన్డే అహ్మదాబాద్ వేదికగా జరిగిన విషయం తెలిసింది. అయితే అప్పటికే రెండు మ్యాచులలో ఓడిపోయి.. సిరీస్ కోల్పోయిన ఇంగ్లాండ్ ఈ మ్యాచ్ గెలవాలని పట్టుదలతో బరిలోకి దిగుతుందని.. గెలిచేందుకు గట్టిగా ప్రయత్నిస్తుందని అంతా భావించారు. కానీ భారత్ ముందు ఆ జట్టు నిలవలేకపోయింది. ఏకంగా 142 పరుగుల తేడాతో చిత్తుగా ఓడిపోయింది.

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. ఇంగ్లాండ్‌కు 357 పరుగుల లక్ష్యాన్ని నిలిపింది. అయితే ఛేజింగ్‌లో ఇంగ్లాండ్.. తడబడింది. ఓ దశలో 154 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అప్పుడు క్రీజులో లియామ్ లివింగ్‌స్టోన్, హ్యారీ బ్రూక్‌లు ఉన్నారు. అయితే ఈ మ్యాచ్ తుది జట్టులో చోటు దక్కించుకోలేకపోయిన ఇంగ్లాండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్.. మ్యాచ్ జరుగుతుండగా డగౌట్‌లో నిద్రపోతూ కనిపించాడు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.

ఇక ఈ వీడియోపై స్పందించిన టీమిండియా మాజీ క్రికెటర్, హెడ్ కోచ్ రవిశాస్త్రి విమర్శలు గుప్పించాడు. “నిద్ర పోవడానికి ఇదే సరైన సమయం. ఈ సిరీస్ మొత్తం వారు ఇదే చేశారు” అని వ్యాఖ్యానించాడు. ఈ వీడియోను చూసిన నెటిజన్లు ఇంగ్లాండ్ క్రికెట్ జట్టుపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఇలాంటప్పుడు.. పర్యటనలకు రావడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. కాగా ఈ పర్యటనలో భాగంగా నాలుగు టీ20లు, ఒక వన్డేలో ఆడిన ఆర్చర్.. కేవలం 7 వికెట్లు మాత్రమే తీశాడు.

# ఛాంపియన్స్ ట్రోఫీ ప్రైజ్‌మనీ ఎంతో తెలుసా..




స్పోర్ట్స్ న్యూస్,14 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): ఎనిమిదేళ్ల విరామం తర్వాత ప్రపంచ క్రికెట్ అభిమానులను అలరించేందుకు ఛాంపియన్స్ ట్రోఫీ వచ్చేస్తోంది. ఈ నెల 19 నుంచి పాకిస్థాన్ వేదికగా టోర్నీ ప్రారంభం కానుంది. ఇందుకోసం ఇప్పటికే అన్ని దేశాలు కూడా తమ జట్లను ప్రకటించాయి. కొన్ని జట్లయితే ఆతిథ్య పాకిస్థాన్‌లో ఇప్పటికే అడుగుపెట్టి.. ప్రాక్టీస్ ప్రారంభించాయి. వన్డే ప్రపంచకప్ 2023 పాయింట్ల పట్టికలో టాప్-8లో నిలిచిన జట్ల మధ్య ఈ పోటీ జరగనుంది. ఛాంపియన్స్ ట్రోఫీ మరో 5 రోజుల్లో ప్రారంభం కానుండగా.. ఐసీసీ ఈ టోర్నీకి సంబంధించిన ప్రైజ్ మనీ వివరాలు శుక్రవారం (ఫిబ్రవరి 14) విడుదల చేసింది. గతంలో జరిగిన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీతో పోలిస్తే.. ఏకంగా 53 శాతం ప్రైజ్‌మనీని పెంచింది. విజేత, రన్నరప్ సహా అన్నింటితో కలిపి మొత్తంగా రూ. 59 కోట్లను జట్లకు అందించనుంది. ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో ఛాపియన్‌గా నిలిచిన జట్టుకు ఏకంగా రూ. 20.8 కోట్ల ప్రైజ్‌మనీ దక్కనుంది. ఆ తర్వాత రన్నరప్‌కు విజేత ప్రైజ్‌మనీలో సగం అంటే రూ. 10.4 కోట్లు దక్కనుంది. ఇక సెమీ ఫైనల్ చేరిన మరో రెండు జట్లూ రూ. 5.2 కోట్ల చొప్పున అందుకుంటాయి. పాయింట్ల పట్టికలో ఐదు, ఆరో స్థానాల్లో నిలిచిన జట్లకు రూ. 3 కోట్లు దక్కుతాయి. చివరి రెండు స్థానాలకు పరిమితమైన జట్లు ఈ టోర్నీ ద్వారా రూ. 1.2 కోట్లను ఆర్జించనున్నాయి. ఇక టోర్నీలో గెలిచే ఒక్కో మ్యాచ్‌కు ఆయా జట్టుకు అదనంగా రూ. 29 లక్షలను ఐసీసీ ముట్టజెప్పనుంది. గత ఛాంపియన్స్ ట్రోఫీతో పోలిస్తే ఈ మొత్తం చాలా ఎక్కువ. చివరగా 2013లో ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ జరిగింది. ఇందులో టైటిల్ సాధించిన పాకిస్థాన్‌కు రూ. 14.18 కోట్లు దక్కాయి. రన్నరప్‌గా నిలిచిన టీమిండియా రూ. 7 కోట్లు సొంతం చేసుకుంది. సెమీ ఫైనల్ చేరిన రెండు జట్లు రూ. 3 కోట్ల చొప్పున అందుకున్నాయి. ఇక ఐదు, ఆరో స్థానాల్లో నిలిచిన జట్లకు రూ. 58 లక్షలు.. చివరి రెండు స్థానాల్లో ఉన్న జట్లకు రూ. 39 లక్షలు అందాయి.

## ఆటగాళ్ల కుటుంబ సభ్యులకు నో చాన్స్!



స్పోర్ట్స్ న్యూస్,14 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): బీసీసీఐ సరికొత్త నిబంధనలు ఒక్కొక్కటిగా అమల్లోకి వస్తున్నా యి. ఇప్పటికే బోర్డు చెప్పినట్టు టీమిండియా ఆటగాళ్లు దేశవాళీ క్రికెట్‌లో పాల్గొనగా.. తాజాగా తమ కుటుంబసభ్యులు లేకుండానే చాంపియన్స్ ట్రోఫీ (సీటీ)కి వెళ్లనున్నారు. ఈనెల 19న ఆరంభం కానున్న సీటీలో పాల్గొనేందుకు జట్టు శనివారం దుబాయ్ పయనం కానుంది. అయితే బోర్డు నూతన ప్రయాణ నియమాల ప్రకారం తొలిసారిగా ఆటగాళ్లు మాత్రమే అక్కడికి వెళ్లబోతున్నారు. విదేశీ పర్యటన 45 రోజులు.. అంతకంటే ఎక్కువగా ఉంటేనే ఆటగాళ్ల కుటుంబసభ్యులకు గరిష్టంగా రెండు వారాలపాటు అనుమతి ఉంటుంది. కానీ సీటీ షెడ్యూల్ మూడు వారాలే కావడంతో ప్లేయర్ల భార్యా పిల్లలు స్వదేశాల్లోనే ఉండాల్సి వస్తోంది. ఒకవేళ ఎవరికైనా మినహాయింపునిచ్చినా.. పూర్తి ఖర్చులు ఆటగాళ్లే భరించాల్సి ఉంటుందని బోర్డు అధికారి పేర్కొన్నాడు.

# తెలంగాణకు రెండు కాంస్యాలు



స్పోర్ట్స్ న్యూస్,14 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): జాతీయ క్రీడలను రెండు కాంస్య పతకాలతో తెలంగాణ ముగించింది. గురువారం జరిగిన షాట్‌గన్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మునీక్/రష్మీ ద్వయం కాంస్య పతకం సొంతం చేసుకుంది. నెట్‌బాల్ మిక్స్‌డ్ విభాగంలోనూ తెలంగాణ జట్టు మూడో స్థానం దక్కించుకుంది. కాంస్య పతక పోరులో తెలంగాణ-ఛత్తీసగఢ్ 31-31తో సమంగా నిలిచాయి. దాంతో రెండు జట్లకు కాంస్య పతకాలు ప్రకటించారు. కాగా..గత నెల 28న ప్రారంభమైన జాతీయ క్రీడల్లో పోటీలు గురువారం ముగిశాయి. శుక్రవారం ముగింపు కార్యక్రమం జరుగుతుంది. కాగా పట్టికలో ఆంధ్ర జట్టు 14 (7-1-6) పతకాలతో 18వ స్థానం, తెలంగాణ 18 (3-3-12) పతకాలతో 26వ స్థానంలో నిలిచాయి. ఇక ఓవరాల్‌గా చూస్తే సర్వీసెస్ 121 (68 స్వర్ణ, 26 రజత, 27 కాంస్య) పతకాలతో అగ్ర స్థానంలో నిలిచింది. మహారాష్ట్ర (54 స్వర్ణ, 71 రజత, 73 కాంస్య-198) రెండో స్థానం, హరియాణా (48 స్వర్ణ, 47 రజత, కాంస్య 58-153) మూడో స్థానం సాధించాయి.

KR TV క్రాంతి
శనివారం 15 ఫిబ్రవరి 2025
సినిమా న్యూస్
epaper.krtvnews.com



# ట్యాగ్‌లతో టికెట్లు అమ్ముడుపోవు:

మూవీ న్యూస్,14 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):తన రీసెంట్ మూవీ 'ఛావా' ప్రమోషన్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో 'నేషనల్ క్రష్' ట్యాగ్ గురించి మాట్లాడారు నటి రష్మిక. కేవలం ట్యాగ్‌ల వల్ల మాత్రమే సినిమా టికెట్లు అమ్ముడుపోవని అన్నారు. వీటి కంటే ప్రేక్షకుల ప్రేమాభిమానాలు తనకు ముఖ్యమని తెలిపారు.

"ట్యాగ్స్ కెరీర్‌కు ఉపయోగపడతాయంటే నేను నమ్మను. కొంతమంది అభిమానులు ప్రేమగా ఇలాంటివి ఇస్తుంటారు. ఏది ఏమైనా అవి కేవలం ట్యాగ్స్ మాత్రమే. మనం నటించే చిత్రాలు, ప్రేక్షకుల ప్రేమాభిమానాలే టికెట్ సేల్స్‌పై ప్రభావం చూపిస్తాయి. అనుకోకుండా ఇండస్ట్రీలోకి వచ్చాను. 24 చిత్రాల్లో నటించాను. నాకంటూ ఒక గుర్తింపు తెచ్చుకుని.. నా ప్రయాణాన్ని ఎంజాయ్ చేస్తున్నా" అని చెప్పారు.

దక్షిణాదితోపాటు హిందీ చిత్రపరిశ్రమలోనూ రాణించడంపై మాట్లాడుతూ.. "అన్ని ప్రాంతాల ప్రేక్షకుల ఆదరణ సొంతం చేసుకోవడం ఆనందంగా ఉంది. అందుకు అనుగుణంగా కొన్నిసార్లు నిద్రకు టాటా చెప్పేసి.. వర్క్ లైఫ్‌పై ఫోకస్ చేస్తున్నా" అని అన్నారు.

# మరో జన్మంటే.. నీ హృదయంగా పుడతా

## నటికి ఆర్థిక నేరగాడు ప్రేమలేఖ



మూవీ న్యూస్, 14 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ కు.. జైలు శిక్ష అనుభవిస్తోన్న ఆర్థిక నేరగాడు సుఖేశ్ చంద్రశేఖర్ ప్రేమలేఖ రాశాడు. మరో జన్మంటే ఆమె హృదయంగా పుట్టాలనుందని అన్నాడు. ఆమెకు ప్రైవేట్ జెట్‌ను కానుకగా ఇస్తున్నట్లు తెలిపాడు. "బేబీ.. హ్యాపీ వాలంటైన్స్ డే. ఈ సంవత్సరం మనకు ఎంతో సానుకూలంగా, ప్రత్యేకమైన విషయాలతో ప్రారంభమైంది. జీవితాంతం ప్రేమికుల రోజును మనం సెలబ్రేట్ చేసుకోవడానికి ఒక్క అడుగు దూరంలో ఉన్నాం. జాకీ.. నిజంగానే నాకు నువ్వంటే ఎంతో ఇష్టం. ఈ ప్రపంచంలోనే అద్భుతమైన ప్రియురాలివి. పిచ్చివాడిలా నిన్ను ప్రేమిస్తున్నా.

వృత్తిపరమైన పనుల రీత్యా నువ్వు వివిధ దేశాలకు ప్రయాణిస్తుంటావు. అందుకే నీకు ఒక ప్రైవేట్ జెట్‌ను కానుకగా ఇస్తున్నా. నీ పేరులోని తొలి అక్షరాలు ఆ జెట్‌పై రాసి ఉంటాయి. అదే విధంగా నీ పుట్టిన రోజు తేదీతో రిజిస్ట్రేషన్ నంబర్ తీసుకున్నా. ఈ జెట్‌లో ఇకపై నీ ప్రయాణాలు సౌకర్యంగా జరుగుతాయి. నాకున్న కోరిక ఒక్కటే. నాకంటూ మరో జన్మ ఉంటే.. నీ హృదయంగా పుట్టాలని ఉంది. ఆవిధంగా నీ గుండె చప్పుడు అవుతా. నీలాంటి అందమైన, అద్భుతమైన మనిషిని ప్రియురాలిగా కలిగి ఉన్నందుకు ఈ భూమ్మీద అదృష్టవంతుడిని నేనే" అని సుఖేశ్ రాసుకొచ్చాడు.

సుఖేశ్ 2020 జూన్ నుంచి మే 2021 వరకు మొబైల్ ఫోన్లు, వాయిస్ మాడ్యూలర్లు వినియోగిస్తూ ర్యాన్‌బ్యాక్సీ మాజీ యజమాని శివీందర్ సింగ్ భార్య అదితి సింగ్‌కు ఫోన్లు చేశాడు. లా సెక్రటరీ అనూప్‌కుమార్‌గా పరిచయం చేసుకొన్నాడు. ఆమె భర్తకు బెయిల్ ఇప్పిస్తానని రూ.200 కోట్లకుపైగా వసూలు చేశాడు. ఈ కేసులో పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. ఈ క్రమంలోనే అతడు జాక్వెలిన్‌తో క్లోజ్‌గా ఉన్న ఫొటోలు బయటకు వచ్చాయి. ఆమె తన ప్రియురాలని పేర్కొన్నాడు. మరోవైపు సుఖేశ్ చంద్రశేఖర్ తన జీవితాన్ని నరకప్రాయం చేశాడని జాక్వెలిన్ ఫెర్నాండెజ్ వాపోయింది. అతడు తన జీవితంతో ఆడుకొని కెరీర్‌ను నాశనం చేశాడని న్యాయస్థానం ఎదుట వాంగ్మూలం ఇచ్చింది. ఇంత జరిగినా సుఖేశ్ మాత్రం జాక్వెలిన్‌కు జైలులో నుంచే ప్రేమ లేఖలు రాస్తున్నాడు. ప్రతి పండుగకు లేఖ పంపిస్తున్నాడు. క్రిస్మస్ కానుకగా పారిస్‌లో ఒక వైన్ యార్డ్‌నే కానుకగా ఇస్తున్నట్లు తెలిపాడు.

# ఆ కారణంగా ఎన్నో అవకాశాలు కోల్పోయా



మూవీ న్యూస్, 14 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):ఇండస్ట్రీకి వచ్చిన 14 ఏళ్ల తర్వాత బాలీవుడ్ పరిశ్రమలోకి అడుగుపెట్టారు నటి రెజీనా ప్రస్తుతం హిందీలో రెండు సినిమాలు చేస్తున్నారు. తాజాగా ఆమె ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో బాలీవుడ్‌లో దక్షిణాది నటీనటులు కొనసాగడం కష్టమన్నారు. భాష రాకపోవడం వల్ల తాను ఎన్నో అవకాశాలు కోల్పోయినట్లు చెప్పారు.

"నేను 9 సంవత్సరాల వయసు నుంచి నటించడం ప్రారంభించాను. 25 ఏళ్లుగా ఎన్నో సినిమాలు, ప్రకటనల్లో నటించాను. కాబట్టి నాకు ఇండస్ట్రీ మీద అవగాహన ఉంది. పరిశ్రమలో నటిగా ఉండడం.. ముఖ్యంగా బాలీవుడ్‌లో దక్షిణాది నటిగా కొనసాగడం చాలా కష్టం. నేను హిందీ సినిమా కోసం ఆడిషన్ ఇచ్చినప్పుడు ఈ భాష మాట్లాడగలనో, లేదో అని చూశారు. దక్షిణాది సినిమా పరిశ్రమలో ఈ విషయాన్ని పట్టించుకోరు. ఏ భాషకు చెందినవారినైనా ఎంపిక చేసుకుంటారు. అందుకే కోలీవుడ్, టాలీవుడ్‌లలో ఇతర భాషలకు చెందిన ఎంతోమంది నటీనటులు అగ్ర తారలుగా ఎదిగారు. నేను హిందీ సరిగ్గా మాట్లాడలేకపోయినందున ఎన్నో అవకాశాలు కోల్పోయాను. నేను పంజాబీ అమ్మాయిగా నటించలేను. కానీ, ఒక పంజాబీ అమ్మాయి మాత్రం దక్షిణాది నటిగా చేయగలదు. నా విషయంలో అదే జరిగింది. నార్త్‌లో నటిస్తున్న హీరోయిన్‌లే సౌత్ ఇండియన్ సినిమాల్లోనూ నటిస్తున్నారు" అని చెప్పారు.సినిమాల విషయానికొస్తే.. రెజీనా ఇటీవల 'విదాముయార్చి'లో కనిపించారు. అగ్ర కథానాయకుడు అజిత్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాను మగిజ్ తిరుమేని తెరకెక్కించారు. త్రిష, రెజీనా కీలకపాత్రల్లో కనిపించారు. ప్రస్తుతం రెజీనా రెండు హిందీ సినిమాలు, ఓ తమిళ చిత్రంలో నటిస్తూ బిజీగా ఉన్నారు.



# బాలీవుడ్ ఆ విషయంలో విఫలమైంది: పంకజ్ త్రిపాఠి

మూవీ న్యూస్,14 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): మీర్జాపూర్'తో అన్ని భాషల్లోనూ అభిమానులను సొంతం చేసుకున్నారు బాలీవుడ్ నటుడు పంకజ్ త్రిపాఠి. ఇందులో కలీన్ భయ్యాగా నటించి మెప్పించారు. తాజాగా ఆయన బాలీవుడ్ గురించి చేసిన వ్యాఖ్యలు వైరలవుతున్నాయి. ప్రేక్షకులను ఎప్పటికీ గుర్తుండిపోయే కథలను తెరకెక్కించడంలో బాలీవుడ్ విఫలమైందన్నారు. "ప్రేక్షకుల మదిలో నిలిచిపోయే సినిమాలను రూపొందించాలి. 90ల్లో అలాంటి కథలే ఎక్కువగా తెరకెక్కాయి. వాటికి ప్రేక్షకులు కనెక్ట్ అయ్యేవారు. ఆ సినిమాలను కుటుంబసమేతంగా చూసి ఆనందించేవారు. ఆ మ్యాజిక్ ఇప్పటి కథల్లో లేదు. వినోదం కోసం సినిమాలను చూస్తున్నారంతే గానీ.. పాత్రలతో కనెక్ట్ కావడం లేదు. కథలో బలం ఉంటే ఆ సినిమా ఎన్నిసార్లు రిలీజ్ చేసినా హిట్ అవుతుంది. నేను నటించిన 'బరేలీ కీ బర్ఫీ' చిత్రం ఇటీవల కూడా రీరిలీజై మరోసారి ప్రేక్షకాదరణ సొంతం చేసుకుంది" అని గుర్తుచేశారు.ఒకే జానర్‌లో సినిమాలు తీసినా అవి విజయం సాధించవని పంకజ్ త్రిపాఠి అన్నారు. "గతంలో హారర్ జానర్‌లో విడుదలైన 'స్త్రీ' గొప్ప విజయాన్ని సొంతం చేసుకుంది. ఆ తర్వాత అదే జానర్‌లో ఎన్నో చిత్రాలు తెరకెక్కాయి. ఒక సమయంలో ప్రేక్షకులు వాటిని చూసి భయపడలేదు.. నవ్వుకున్నారు. ప్రయోగాత్మక సినిమాలను తెరకెక్కించలేకపోతే ప్రేక్షకులు విసుగు చెందుతారు" అని పంకజ్ త్రిపాఠి చెప్పారు. మీర్జాపూర్ తర్వాత తనకు కలీన్ భయ్యా లాంటి పాత్రలు ఎన్నో వచ్చాయని చెప్పిన ఆయన వాటిని తిరస్కరించినట్లు తెలిపారు.ఇక యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన మీర్జాపూర్ సిరీస్ త్వరలోనే సినిమాగా రానుంది. పంకజ్ త్రిపాఠి, శ్వేతా త్రిపాఠి, దివ్యేందు శర్మ, అలీ ఫజల్, శ్రియ పిల్గోంగర్, హర్షిత గౌర్ తదితరులు నటించిన ఈ సిరీస్ మూడు భాగాలుగా వచ్చి అలరించింది. వీటికి భారీ వ్యూస్ రావడంతో నాలుగో భాగాన్ని సినిమాగా తెరకెక్కించనున్నారు.

Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com